

మండల కేంద్రాల్లో అర్జీల స్వీకరణ

అనకాపల్లి రూరల్, నవంబరు 17: జిల్లాలోని మండల కార్యాలయాల్లో కూడా ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రాల్లో తహసీల్దార్, ఎంపీడీవోలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని, ప్రజలు తమ పరిధిలోని మండల కార్యాలయాల్లో అర్జీలు అందజేయాలని ఆమె సూచించారు. వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదన్నారు.

నగర పంచాయతీగా అచ్యుతాపురం?

ఎస్‌ఈజెడ్‌తో శరవేగంగా అభివృద్ధి

గత టీడీపీ హయాంలోనే ప్రతిపాదనలు

- చోడపల్లి, జంగులూరు, భోగాపురం, వెదురువాడ పంచాయతీలను కూడా కలపాలని నిర్ణయం
- కార్యరూపం దాల్చేసమయంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ
- ఐదేళ్లపాటు అటకెక్కిన ప్రతిపాదనలు
- తాజాగా కూటమి అధికారంలోకి రావడంతో కదలిక



అచ్యుతాపురం జంక్షన్



అచ్యుతాపురం పంచాయతీ కార్యాలయం

అచ్యుతాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):

తెలుగుదేశం పార్టీ గతంలో (2014-19) అధికారంలో వున్నప్పుడు అచ్యుతాపురాన్ని నగర పంచాయతీగా చేయాలని నిర్ణయించారు. ఇది ప్రతిపాదనల దశలో వుండగా వైసీపీ అధికారంలోకి వచ్చింది.. నగర పంచాయతీ ప్రతిపాదన మూలనపడింది. ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఒక్కసారి కూడా దీని గురించి పట్టించుకోలేదు. ఈ ఏడాది ప్రథమార్థంలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అచ్యుతాపురం నగర పంచాయతీ ప్రతిపాదన తెరమీదకు వచ్చింది.

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో జనాభా గణనీయంగా పెరుగున్నది. ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఇప్పటికే పలు కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటై ఉత్పత్తులను ప్రారంభించాయి. మరికొన్ని పరిశ్రమలు నిర్మాణ దశలో వుండగా, రానున్న కాలంలో పలు రకాల పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే వున్న కంపెనీలు, పరిశ్రమల్లో వేలాది మంది ఉద్యోగులుగా, కార్మికులుగా పనిచేస్తున్నారు. ఎస్‌ఈజెడ్‌లో పూర్తిస్థాయిలో పరిశ్రమలు ఏర్పాటైతే ఉద్యోగులు, కార్మికులు లక్షలకు చేరుకుంటారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న వారిలో అత్యధిక శాతం మంది స్థానికంగా సొంత నివాసాలు ఏర్పాటు చేసుకోవడం, లేదంటే అద్దె ఇళ్లల్లో వుంటున్నారు. దీంతో అద్దె ఇళ్లకు గిరాకీ పెరిగి కొంతమంది స్థానికులు కొత్తగా ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లు నిర్మిస్తున్నారు. ఇదే సమయంలో వివిధ రకాల వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఏర్పాటవుతున్నాయి. ఇంకా అనుబంధ రంగాలు, వివిధ రకాల వృత్తి నిపుణులు కూడా ఇక్కడ పెరుగుతున్నారు. ఈ కారణాల వల్ల అచ్యుపురంలో జనాభా గణనీయంగా పెరుగుతున్నది.

ప్రత్యేక ఆర్థిక మండలి కారణంగా అచ్యుతాపురం ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని పదేళ్ల క్రితమే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం గుర్తించింది. అచ్యుతాపురాన్ని నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేయాలని 2018లో ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై జిల్లా అధికారులు నివేదిక తయారు చేసేలోగా ఎన్నికలు జరిగి, వైసీపీ అధికారంలోకి వచ్చింది. నగర పంచాయతీ ప్రతిపాదనను అటకెక్కించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అచ్యుతాపురం నగర పంచాయతీ ప్రతిపాదన మరోసారి తెరపైకి వచ్చింది.

ఐదు గ్రామ పంచాయతీలతో..

వాస్తవంగా అచ్యుతాపురం పంచాయతీ పరిధి చాలా తక్కువే! చోడపల్లి, జంగులూరు, భోగాపురం, వెదురువాడ పంచాయతీలు అచ్యుతాపురానికి ఆనుకుని వుండడంతో ఈ ప్రాంతమంతా ఒక పట్టణంలా అభివృద్ధి చెందుతున్నది. దీంతో ఈ ఐదు ... మిగతా 6వ పేజీలో

టీచర్ ఎమ్మెల్సీ ఓటుకు 17,404 దరఖాస్తులు

అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా నుంచి 4,464

- తక్కువగా అల్లూరి జిల్లాలో 1,749
- 23 నుంచి అభ్యంతరాల స్వీకరణ

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):

వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదుకు తొలి విడతలో 17,404 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా నుంచి 4,464 మంది దరఖాస్తుచేయగా, అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 1,749 మంది మాత్రమే దరఖాస్తు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా నమో దు చేసుకునేందుకు ఉపాధ్యాయులు ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ నుంచి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈనెల ఆరోతేదీ వరకు గడువు విధించింది. ఇందులో భాగంగా ఆన్‌లైన్, ఆఫ్ లైన్‌లో ఉపాధ్యాయుల నుంచి దరఖా స్తులు స్వీకరించారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల నుంచి ఆఫ్‌లైన్‌లో 12,602 మంది, ఆన్‌లైన్‌లో 4,802 మంది మొత్తం 17,404 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాల వారీగా చూస్తే శ్రీకాకుళం జిల్లాలో ఆన్‌లైన్‌లో 2,072 మంది, ఆఫ్‌లైన్‌లో 2,392 మంది వెరసి 4,464, విజయనగరం జిల్లాలో ఆన్‌లైన్‌లో 555 మంది, ఆఫ్‌లైన్‌లో 3,273తో వెరసి 3,828 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో ఆన్‌లైన్‌లో 340 మంది, ఆఫ్‌లైన్‌లో 1,796 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆన్‌లైన్‌లో 212 మంది, ఆఫ్‌లైన్‌లో 1537 మంది, విశాఖపట్నం జిల్లాలో ఆన్‌లైన్‌లో 1252 మంది, ఆఫ్‌లైన్‌లో 2,093 మంది, అనకాపల్లి జిల్లాలో ఆన్‌లైన్‌లో 371 మంది, ఆఫ్‌లైన్‌లో 1511 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఓటర్ల ముసాయిదా జాబితాను ఈ నెల 23న విడుదల చేస్తారు. అనంతరం అభ్యంతరాలను స్వీకరిస్తారు. కాగా ఇంతవరకు దరఖాస్తుచేయని టీచర్లు అదే రోజు నుంచి కొత్తగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

వరిపై క్రిమికీటకాలు దాడి

గుమ్మాళ్లపాడులో కత్తెర పురుగు కొరికివేయడంతో నేల రాలిన వరి కంకులు



ఆర్‌జేఎల్, సాంబ మసూరి రకాలను ఆశించిన కత్తెర పురుగు, సుడిదోమ



వరి పైరును ఆశించిన కత్తెర పురుగులు

- గింజ కట్టిన తరువాత తెగుళ్లు సోకడంపై రైతులు విస్మయం
- తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని ఆందోళన
- నివారణ చర్యలు చేపట్టాలని ఏవో సూచన

రావికమతం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):

మరో రెండు, మూడు వారాల్లో కోతకు రానున్న వరి పైరుపై క్రిమికీటకాలు దాడి చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గింజకట్టిన తరువాత కత్తెర పురుగు (పచ్చపురుగు), సుడిదోమ ఆశించాయని రైతులు చెబుతున్నారు. కొన్నిచోట్ల కత్తెర పురుగు దాడి ఉధృతంగా వుండడంతో వరి కంకులను ఎడాపెడా కొరికివేసి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. సుడిదోమ ఆశించిన పొలంలో వరి దుబ్బులు ఎండిపోయి, కంకులు గింజ కట్టకుండానే పొల్లుగా రాలిపోతున్నదని వాపోతున్నారు.

కత్తెర పురుగు ఎక్కువగా ఆర్‌జేఎల్, సాంబ మసూరి రకాలను ఆశించింది. ఈ పురుగు వ్యాప్తి చాలా వేగంగా వుంటుంది. రైతులు వెంటనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే మూడు, నాలుగు రోజుల్లో పొలం మొత్తం వ్యాపించి వరి వెన్నులు కొరికివేస్తున్నాయి. మండలంలోని గుమ్మాళ్లపాడు, చిన పాచిల, గర్నికం, కొమిర, మత్స్యపురం, మేడివాడ, గొంప తదితర గ్రామాల్లో ఉధృతంగా వుందని రైతులు కరెడ్ల నారాయణ, నక్కా అచ్చిమినాయుడు, కలిగిరి ధనలక్ష్మి, సిద్దా ప్రసాద్ తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరినాట్లు వేసిన కొద్ది రోజుల నుంచి ఇటీవల వరకు తెగుళ్ల నివారణకు పలుమార్లు రసాయన ఎరువులను పిచికారీ చేశామని, మరి కొద్ది రోజుల్లో పంట ... మిగతా 6వ పేజీలో



మత్స్యపురంలో సుడిదోమ తెగులు ఆశించడంతో ఎండిపోతున్న వరి పైరు

కమిటీలతో కాలయాపన

ఏయూలో అడ్డగోలు వ్యవహారాలపై చర్యలకు వెనకడుగు

- ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల పరిస్థితి
- గత వీసీపై విచారణను పట్టించుకోని ప్రభుత్వం

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని అనేక వ్యవహారాలపై ఉన్నతాధికారులు కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా అనేక అంశాలపై కమిటీలు వేశారు. ఇవి ఏమి తేల్చాయన్న దానిపై ఇప్పటి వరకు వివరాలను వెల్లడించలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వర్సిటీ అధికారులు ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, సెంటర్ ఫర్ డిస్టెన్స్ స్టడీస్, రూసా ఫేజ్-2, స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఏయూ టీడీఆర్ హబ్‌ల్లో జరిగిన వ్యవహారాలపై విచారణకు కమిటీలు వేశారు. కమిటీ సభ్యులుగా ఏయూ ప్రొఫెసర్లతోపాటు ఇతర విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, నిపుణులను నియమించారు. ఇవి నియమించి రెండు నెలలు దాటుతు న్నా విచారణ నివేదికలోని అంశాలను వెల్లడించలేదు. గత నెలలో జర్నలిజం కాలేజీ విభాగాధిపతిగా పనిచేసిన డాక్టర్ సీఎం వినయ్‌కుమార్‌ను తొలగించడంతో పాటు విచారణకు ఆదేశించారు. వర్సిటీలో పనిచేస్తూనే కృష్ణా వర్సిటీలో గైడ్‌గా వ్యవహరించారంటూ గవర్నర్‌కు పలువురు ఫిర్యాదు చేయడంతో పూర్తిస్థాయి విచా రణ జరిపి నివేదిక ఇచ్చేలా కమిటీని నియమించారు. దీంతో పాటు వర్సిటీలోని అనేక ప్రాంతాల్లో ఇష్టానుసారంగా ఏర్పాటైన కంటైనర్ షాపులు తొలగించాలని భావించారు. ఉన్నత స్థాయిలో ఒత్తిళ్లు రావడంతో దానిపై మరో కమిటీని వేశారు. తాజాగా వర్సిటీలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ పైడి శ్రీనివాస్‌పై విచారణకు ఆదేశిస్తూ ఐదుగురితో కమిటీని ఏర్పాటుచేశారు. సెలవు పెట్టినా పరిగణనలోకి తీసుకోకుండా ఒక అధికారి ఒత్తిళ్లతో ఇబ్బందులకు గురిచేశారంటూ సదరు ఉద్యోగి చేసిన ఫిర్యాదులను పట్టించుకోలేదు. ఏడాదిన్నరపాటు విధుల్లోకి తీసుకోకపోయినా ... మిగతా 6వ పేజీలో

గొల్లుమంటున్న గోకివాడ రైతు

రాంబిల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):

సాగునీటి వనరుల నిర్వహణ, అభివృద్ధి విషయంలో గత వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న విషయం మండలంలోని గోకివాడ ఆనకట్టను ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని, అన్నదాతలను పలు విధాలుగా ఆదుకుంటున్నామని ఐదేళ్లపాటు కల్లబొల్లి కబుర్లు చెప్పారు. సుమారు 13 వేల ఎకరాలకు నీరు అందించేందుకు బ్రిటీష్ హయాంలో నిర్మించిన గోకివాడ ఆనకట్ట పూర్తిగా ఛిద్రమైంది. ఆధునికీకరణ పనులకు నిధులు మంజూరు చేయాలని ఇరిగేషన్ అధికారులు ఏటా ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపగా, గత ఐదేళ్ల కాలంలో ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు.

రాంబిల్లి మండలం గోకివాడ సమీపంలో మేజర్ శారదా నదిపై 1906వ సంవత్సరంలో ఆనకట్ట నిర్మించారు. దీనికింద రాంబిల్లి, ఎలమంచిలి, ఎస్. రాయవరం మండలాల పరిధిలో 12,600 ఎకరాల ఆయకట్టు వుంది. దశాబ్దాల క్రితం నిర్మితం కావడం, కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకోవడం, తాత్కాలిక మరమ్మతులు చేస్తుండడంతో ఆయకట్టుకు సక్రమంగా నీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఆనకట్టను పునర్నిర్మించాలని రైతులు చాలా కాలంగా ప్రజాప్రతినిధులకు, జలవనరుల శాఖ అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నారు. పుష్కర కాలం క్రితం 2011 నవంబరు 2న ఎలమంచిలిలో జరిగిన రచ్చబండ కార్యక్రమానికి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి.. గోకివాడ ఆనకట్టను రూ.6 కోట్లతో ఆధునీకరిస్తామని ప్రకటించారు. కానీ ఆయన అధికారంలో వున్న సమయంలో నిధులు విడుదల కాలేదు. తరువాత వరుసగా మూడేళ్లపాటు శారదా నదికి



ఆనవాళ్లు లేని ఆనకట్ట తలుపులు

ఆధునికీకరణకు నోచుకోని ఆనకట్ట

- 13 వేల ఎకరాలకుపైగా ఆయకట్టు
- పుష్కర కాలం కిందట వరద ఉధృతికి ధ్వంసమైన షట్టర్లు, ఏప్రాన్, రక్షణ గోడ
- గత టీడీపీ హయాంలో రూ.77 లక్షలు మంజూరు
- పనులు చేపట్టడానికి ముందుకురాని కాంట్రాక్టర్లు
- ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క రూపాయి కూడా మంజూరుకాని వైనం
- ఆనకట్టను అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వానికి రైతులు వినతి

భారీఎత్తున వరదలు రావడంతో ఆనకట్ట పూర్తిగా ధ్వంసమైంది. తలుపులు విరిగిపోయాయి. సుమారు 100 మీటర్ల మేర ఏప్రాన్ దెబ్బతిన్నది. దిగువ భాగంలో రాతిపేర్పు కొట్టుకుపోయింది. టీడీపీ హయాంలో (2017లో) ఆనకట్ట మరమ్మతుల కోసం రూ.77 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టడానికి ముందుకు రాకపోవడంతో నిధులు వెనక్కు మళ్లాయి. తరువాత 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. గొకివాడ ఆనకట్ట పునర్నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. కానీ నిధులు మంజూరు చేయలేదు. తరువాత నుంచి ఏటా అంచనాలు పెరుగుతున్నాయి. కనీసం మరమ్మతు పనులు చేయడానికైనా రూ.2 కోట్లు మంజూరు చేయాలనిఇ గత ఏడాది చివరలో ప్రభుత్వానికి నివేదించారు. ఎప్పటి మాదిరిగానే వైసీపీ ప్రభుత్వం మొండిచేయి

గోకివాడ ఆనకట్ట



చూపింది.

ఎలమంచిలి నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన యూవీ రమణమూర్తిరాజు, ఒకసారి ఎమ్మెల్యేగా పనిచేసిన పంచకర్ల రమేశ్‌బాబు.. ఈ ఆనకట్టను పలుమార్లు పరిశీలించి ఆదునికీరణకు కృషి చేస్తామని చెప్పారు. అయితే కనీసం మరమ్మతులకు కూడా నిధులు మంజూరు చేయించలేకపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి గోకివాడ ఆనకట్ట ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయించాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతులు కాదు.. ఆధునికీకరణే!

వేలాది ఎకరాలకు సాగునీరు అందించే గోకివాడ ఆనకట్ట గత పుష్కర కాలం నుంచి మర్మమ్మతులకు నోచుకోకపోవడంతో పూర్తిగా ఛిద్రమైంది. గేట్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఆనకట్టకు మరమ్మతులు చేసినా ఫలితంగా వుండదు. ఆధునికీకరణతోనే పూర్తి ఆయకట్టుకు నీరు అందుతుంది. కూటమి ప్రభుత్వంపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు.

ద్వారపురెడ్డి నానాజీ, రైతు, గోకివాడ

రైల్వేలో కలకలం



డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌ను అరెస్టు చేసిన సీబీఐ

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):

వాల్తేరు రైల్వే డివిజన్‌లో ఆదివారం కలకలం రేగింది. లంచం తీసుకుంటూ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ముంబైలో సీబీఐ అధికారులకు చిక్కారనే వార్త డివిజన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు నగర వాసుల్లోనూ సంచలనం కలిగింది. డివిజన్ చరిత్రలో డీఆర్ఎం స్థాయి అధికారి సీబీఐకి పట్టుబడడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. డీఆర్ఎంతో సహా మరో ఇద్దరిని సీబీఐ ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్టు ప్రకటించడంతో ఇక్కడి సిబ్బందిలో ఆందోళన నెలకొంది.

నగరంలోని డీఆర్ఎం కార్యాలయం, అధికారిక నివాసంతో పాటు ముంబైలో శనివారం మధ్యాహ్నం

- కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుండగా ముంబైలో పట్టివేత
- ఇక్కడి కార్యాలయం, నివాస భవనంలో అధికారుల సోదాలు
- కీలక దస్త్రాలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం
- ఆందోళనలో రైల్వే ఉద్యోగులు



నుంచి ఆదివారం తెల్లవారు జాము మూడు గంటల వరకు సీబీఐ అధికారులు దాడులు చేశారు. ఈ సందర్భంగా పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో డివిజనల్ అధికారులు, సంబంధిత సిబ్బందిని కూడా వారు విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో వాల్తేరు డివిజన్ ప్రధాన కార్యాలయంలోని అధికారులు, సిబ్బందిలో ఆందోళన నెలకొంది. కొందరు సిబ్బంది సెల్‌ఫోన్‌లో మాట్లాడేందుకు కూడా భయపడుతున్నారు.

జరిమానా తగ్గింపునకు లంచం డిమాండ్

వాల్తేరు డివిజన్‌లో చేపట్టిన నిర్మాణ పనుల్లో జాప్యం జరగడంతో డీఆర్ఎం ఇద్దరు కాంట్రాక్టర్లకు భారీగా జరిమానా విధించారు. అంతేకాకుండా వారు చేపట్టిన ఇతర పనులకు సంబంధించిన బిల్లులు కూడా నిలిచిపోయాయి. దీంతో వారు డీఆర్ఎంను కలిసి, జరిమానా తగ్గించి, బిల్లులు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఒక్కొక్కరు రూ.25 లక్షల చొప్పున ఇవ్వాలని డీఆర్ఎం ... మిగతా 6వ పేజీలో

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

▸▸ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఆదివారం ప్రశాంతి పాలిటెక్నిక్ ఎన్‌సీసీ కేడెట్లు ఆధ్వర్యంలో నిర్వహించిన 2కె, 5కె యాంటి డ్రగ్ అవేర్‌నెస్ రన్‌ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలన పాడుచేసుకోవద్దన్నారు. కూటమి ప్రభుత్వం మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతోందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ నమ్మి గణేష్, ఎస్ఐ సుధాకర్, ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్, బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, పవన్ విజయ్, జనపరెడ్డి నర్సింగరావు, ద్వారపురెడ్డి బాపూజీ పాల్గొన్నారు.

ప్రగడను సత్కరించిన పాడిదిబ్బ రైతులు

మునగపాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాటిదిబ్బ ప్రాంతానికి చెందిన మూల సంఘం రైతులు రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావును ఆదివారం ఘనంగా సత్కరించారు. పాటిదిబ్బ ప్రాంతంలో జరిగిన వన సమారాధనకు ప్రగడ నాగేశ్వరరావును ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ పాడి, పంటలు సమృద్ధిగా వృద్ధి చెంది, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని పరమ శివుడును ప్రార్థించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణంలను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, దాడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

నగర పంచాయతీగా అచ్యుతాపురం?

... 5వ పేజీ తరువాయి

పంచాయతీలను కలిసి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేయాలని నాటి టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో దీని గురించి పట్టించుకోలేదు. ఇప్పుడు టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వుండడంతో నగర పంచాయతీ ఏర్పాటుపై కదలిక వస్తుందని స్థానికులు భావిస్తున్నారు. అధికారులు గణాంకాల ప్రకారం అచ్యుతాపురం, చోడపల్లి, జంగులూరు, భోగాపురం, వెదురువాడ పంచాయతీల్లో జనాభా 50 వేల వరకు వుంటుందని అంచనా. రానున్న రోజుల్లో ప్రత్యేక ఆర్థిక మండలిలో ఎన్‌టీపీసీ భారీ గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. సుమారు 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఎస్ఈజడ్‌లో మరెన్నో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. దీంతో రానున్న ఐదేళ్ల కాలంలో ఇక్కడ జనాభా లక్షకు చేరుకున్నా ఆశ్చర్యపడాల్సిన పనిలేదని స్థానిక నేతలు అభిప్రాయపడుతున్నారు.

రైల్వేలో కలకలం

... 5వ పేజీ తరువాయి

కోరారు. ఈ మేరకు ముంబైలో డబ్బు ఇస్తుండగా అప్పటికే అందిన సమాచారంతో సీబీఐ అధికారులు పట్టుకున్నారు.

అసలేం జరిగింది...

గత డీఆర్ఎంలతో పోల్చితే సౌరభ్‌ప్రసాద్ వ్యవహారశైలి భిన్నంగా ఉంటుందని సిబ్బంది చెబుతున్నారు. ఇక్కడ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తన చాంబర్‌లోకి ఇతరులను పరిమితంగా అనుమతించేవారని, శాఖాధికారులు మినహా ఇతరులు, కాంట్రాక్టర్లను రానివ్వలేదని సమాచారం. తన స్థాయిలో చేయాల్సిన పనులను మినహాయిస్తే మిగిలిన వాటికి సంబంధిత అధికారికి సిఫారసు చేసేవారని తెలిసింది. గత డీఆర్ఎం మాదిరిగా సిబ్బందిపై చర్యలు తీసుకోవడం, బదిలీలు చేయడం, అర్హత లేనివారికి సహకరించేవారు కాదంటున్నారు. వివిధ మార్గాల్లో ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించే వారిని కూడా డీఆర్ఎం దూరం పెట్టేవారని, కీలక అంశాల్లో ఆచితూచి నిర్ణయాలు తీసుకునేవారని సమాచారం. దీంతో కొంతమందిలో వ్యతిరేకత వచ్చిందంటున్నారు. అయితే కొందరికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చిన నేపథ్యంలో తన అనుచరులతో ఇలాంటి లావాదేవీలు జరిపి ఉంటారని మరికొంతమంది అభిప్రాయపడుతున్నారు.

వరిపై క్రిమికీటకాలు దాడి

... 5వ పేజీ తరువాయి

చేతికవచ్చే తరుణంలో కూడా తెగుళ్ల సోకడం ఇప్పుడే చూస్తున్నా మని అంటున్నారు. ఈ ఏడాది వర్షాలు సంతృప్తికరంగానే కురిసి, వాతావరణం అనుకూ లంగా వుండడంతో వరి పంట బాగానే పం డిందని, దిగుబడి కూడా ఆశాజనకంగా వుం టుందని భావిస్తున్న తరుణంలో కత్తెర పురుగు, సుడిదోమ ఆశించి నష్టాన్ని కలుగ జేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు.

కాగా గింజ దశలో వున్న వరి పైరును ఆశించిన తెగుళ్ల గురించి మండల వ్యవసాయ అధికారి డి.రూప దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా.. నివారణ చర్యల కోసం ఆమె పలు సూచనలు చేశారు. కత్తెర పురుగు దాడి విషయాన్ని ఇప్పటికే పలువురు రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ పురుగులు చాలా వేగంగా వ్యాప్తి చెంది, వరి వెన్నులను కొరికివేస్తాయన్నారు. కత్తెర పురు గులు పగటిపూట వరి దుబ్బుల మొదళ్లలో వుంచి, చీకటి పడిన తరువాత బయటకు వచ్చి వరి వెన్నులను కొరికివేస్తాయని ఆమె వివరించారు.

కత్తెర పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ మందును లీటరు నీటిలో 0.5-1.0 గ్రాముల చొప్పున కలిపి ఎకరానికి 100 నుంచి 150 లీటర్ల వరకు మందు నీటిని పిచికారీ చేసుకోవాలన్నారు. లేకపోతే ప్రొఫెనోపాస్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున ఎకరానికి 200 లీటర్ల మందునీటిని పిచికారీ చేయాలని సూచించారు.

సుడిదోమ నివారణకు పైమెట్రోజైన్ అనే మందును లీటరు నీటికి 0.6 గ్రాముల చొప్పున కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు నీటిని వరి దుబ్బు పైనుంచి మొదళ్ల వరకు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. లేదంటే థియోమిథాక్సమ్ మందునైనా పిచికారీ చేసుకోవచ్చున్నారు. కత్తెర పురుగు, సుడిదోమ సాయంత్రం పూట దుబ్బుల నుంచి బయటకు వస్తాయని, ఈ సమయంలో మందులను పిచికారీ చేస్తే నియంత్రణ సాధ్యమవుతుందని మండల వ్యవసాయ అధికారి రూప వివరించారు.

కమిటీలతో కాలయాపన

... 5వ పేజీ తరువాయి

బాధ్యులపై చర్యలు తీసుకోలేని స్థితిలో ఉన్నారు.


మాజీ వీసీపై విచారణ లేనట్టేనా..?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలుత ఏయూ పై దృష్టి సారిస్తారని అంతా భావించారు. అయితే ఆరు నెలలు అవుతున్నా వర్సిటీ అధికారులు, ప్రభుత్వ పెద్దలు ఏయూపై దృష్టి పెట్టలేదు. దీనిపై వర్సిటీలోని పలువురు ఉద్యోగులే రగిలిపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వర్సిటీలో అడ్డగోలు వ్యవహారాలు సాగాయని, దీనిపై అప్పట్లోనే నారా లోకేశ్, పవన్ కల్యాణ్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు కూడా చేశారని గుర్తుచేస్తున్నారు. ఇప్పటివరకు గత వీసీతో సహా మరికొంతమంది అధికారుల ఆగడాలపై చర్యల్లేవని ఇదే ఇప్పుడు ఎంతో మంది ఆగ్రహానికి కారణమవుతోంది. గత ప్రభుత్వంపై పోరాటం చేసిన ఎంతో మంది ప్రస్తుతం ప్రభుత్వ మెతక వైఖరిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేడు నాగులాపల్లిలో శూలాల పండుగ

▸▸ శూలధారణతో మొక్కులు చెల్లించడానికి వీరశైవుల సన్నద్ధం

▸▸ ప్రత్యేక ఆకర్షణగా 1001 ఇనుప చువ్వల సుబ్రహ్మణ్యం శూలం



మునగపాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగులాపల్లిలో శతాబ్దాల చరిత్ర కలిగిన పార్వతి, సాంబమూర్తిల శూలాల పండుగ సోమవారం జరగనుందని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మోరా రామేశ్వరరావు, ఆంఢ్ర మల్లేశ్వరరావు తెలిపారు. ఏటా కార్తీక మాసం మూడో సోమవారం శూలాల సంబరం నిర్వహిస్తామన్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక, పూజలు, దర్శనాలు ఉంటాయని, సాయంత్రం ఏడు గంటల నుంచి మొక్కు శూలాలు ఉంటాయన్నారు. అనంతరం 1001 ఇనుప చువ్వలు కలిగిన సుబ్రహ్మణ్యం శూలం, 516 ఇనుప చువ్వలతో చేసిన శివ శూలంతోపాటు 116 చువ్వలు కలిగిన శూలాలను వీర శైవులు ధరిస్తారన్నారు. 508 ఇనుప మేకులతో కూడిన పాదరక్షలను ధరిస్తారని చెప్పారు. ఇవి ఒళ్లు గగ్గుర పుట్టించే విధంగా ఉంటాయన్నారు. నాగులాపల్లి దేవాంగుల వీధిలో రెండు శతాబ్దాల క్రితం ఓంకార శబ్దం రావడం, అక్కడ భూమి పగిలి ఉండడంతో తవ్వి చూడగా విభూది శివ లింగం బయట పడిందన్నారు. ఆ ప్రాంతంలో చిన్న కొబ్బరి మట్టలతో పందిర వేసి పూజలు మొదలు పెట్టారన్నారు. 1858లో భారీ ఎత్తున వరదలు రావడంతో పందిరి కొట్టుకుపోయిందని, విభూధి శివలింగం చెక్కు చెదరలేదన్నారు. దాంతో పాలతో శుద్ధి చేసి తిరిగి పూజలు మొదలు పెట్టారన్నారు. వ్యాపారరీత్యా రంగూన్, బర్మా వలస వెళ్లిన దేవాంగులు అక్కడ జరిగిన శూలాల పండుగను తిలకించి నాగులాపల్లిలో కూడా నిర్వహణకు శ్రీకారం చుట్టారన్నారు. అప్పటి నుంచి గ్రామస్థుల సహాయ, సహకారాలతో ఏటా కార్తీక మాసం మూడో సోమవారం శూలాల పండుగ జరుగుతూనే ఉందన్నారు. రంగు రంగుల నూలు దారాలతో 15 రోజులుపాటు శ్రమించి తయారు చేసిన మూడు అంతస్థుల నూలు గుమ్మటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందన్నారు.

ఆత్మీయ సమావేశాలతో ఎన్నో ఉపయోగాలు : ప్రగడ

నక్కపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల వారి వంశం మూలాలు భావితరాలకు తెలియజేసే అవకాశం కలుగుతుందని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఉపమాకలో ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా వున్న ప్రగడ కుటుంబీకుల ఆత్మీయ సమావేశం జరిగింది. అనేక జిల్లాల నుంచి 800 మంది ప్రగడ కుటుంబీకులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒక వ్యక్తి ద్వారా కుటుంబం, తద్వారా వంశం నిర్మాణమవుతుందన్నారు. అనేక ప్రాంతాల్లో స్థిరపడిన ఒక వంశం వారిని ఒకచోటకు చేర్చడం చాలా గొప్ప పరిణామమని చెప్పారు. ఇందుకు కంకణం కట్టుకున్న ప్రగడ దుర్గా ప్రసాద్, చక్రధరరావు, జగన్నాథరావు, చక్రి, వీరబాబు, జగదీశ్వరరావు, దుర్గ తదితరులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి తదితరులను దుశ్శాలువలతో సత్కరించారు. అనేక జిల్లాల నుంచి తరలివచ్చిన ప్రగడ కుటుంబీకులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎంతో ఉల్లాసంగా గడిపారు.



ప్రగడ నాగేశ్వరరావు, కొప్పిశెట్టి వెంటేశ్‌లను సత్కరిస్తున్న దృశ్యం

రామ్మూర్తినాయుడికి ఘన నివాళి

అచ్యుతాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు రామ్మూర్తినాయుడికి ఏపీ రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఘన నివాళులర్పించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. రామ్మూర్తినాయుడు మరణం కుటుంబంతోపాటు పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో బద్ది వెంకటరమణ, మేరుగు అప్పలనాయుడు, లాలం సత్తిబాబు, ఆడారి సాంబశివరావు, లాలం ప్రసాద్, కోసూరి ఈశ్వరరావు, గుర్రం గోవింద్, ఉల్లింగల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు రామ్మూర్తినాయుడు ఆకస్మిక మృతి పట్ల టీడీపీ నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం నక్కపల్లిలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు నారా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అచ్యుతాపురంలో రామ్మూర్తి నాయుడికి నివాళులర్పించిన ప్రగడ నాగేశ్వరరావు

కోటవురట్లలో..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు రామూర్తినాయుడుకు తెలుగుతమ్ముళ్లు ఘన నివాళులర్పించారు. ఆదివారం కోటవురట్లలో రామ్మూర్తినాయుడు చిత్రపటానికి టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు పి.సూర్యారావు, రాజుపేట సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సత్యనారాయణ. సుంకర బాబ్జి, సబిరెడ్డి, శివ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చినదొడ్డిగల్లులో ఆటల పోటీలు

నక్కపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం హైస్కూల్‌లో పిల్లలకు గ్రంథాలయాధికారి కె.జనార్దన్ పలు పోటీలు నిర్వహించారు. బాల,బాలికలు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి. కవిత, ఉపాధ్యాయులు విజయ, శ్రీను, గ్రంథాలయ సిబ్బంది రమణమ్మ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి : ఎక్సైజ్ సీఐ

ఎలమంచిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా సన్మార్గంలో నడవాలని ఎక్సైజ్ సీఐ తేజోవెంకట కుమార్ సూచించారు. ఆదివారం మునిసిపాలిటీ కొక్కిరాపల్లి సమీపంలో గ్రామజ్యోతి యువతీ, యువకుల ఆధ్వర్యంలో వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత లక్ష్యసాధనలో ముందడుగు వేసేందుకు అహర్నిశలు కృషిచేయాలన్నారు. పట్టణ ఎస్ఐ సావిత్రి మాట్లాడుతూ మైనర్లు ద్విచక్ర వాహనాలను నడపకూడదన్నారు. ఎన్నారై మజ్జి రామకృష్ణ దంపతులు అందించిన బహుమతులను యువతకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, స్థానికులు మజ్జి వీరబాబు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి శ్రమిస్తాను : బొడ్డేడ

మునగపాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతం కోసం నిరంతం శ్రమిస్తానని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కార్యదర్శిగా జగన్ అప్పగించిన బాధ్యతలను అందరి సహకారంతో నిర్వహిస్తానన్నారు. ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతానన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాసరి అప్పారావు, మద్దాల వీరునాయుడు, ఆడారి గణపతి అచ్చింనాయుడు, కోనపల్లి రామ్మోహన్‌రావు, ఆడారి కాశీబాబు, బీశెట్టి ధనశ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వేమగిరిలో ఘనంగా వనభోజనాల సందడి

ఎస్. రాయవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమగిరిలో ఆదివారం వనభోజనాల సందడి నెలకొంది. ఈ గ్రామంలో ఉన్న కొండపై కొలువైన లక్ష్మీరంగనాయకస్వామి ఆలయంలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం వనభోజనాలను చేశారు. మండలంలో ఉన్న పలు గ్రామాల భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. అధికసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆ ప్రదేశంలో ఆధ్యాత్మికశోభ సంతరించుకొంది.

విద్యార్థులకు బుక్ రీడింగ్, టెల్లింగ్ పోటీలు

కోటవురట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో గ్రంథాలయాధికారి అప్పలనాయుడు, జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు, కస్తూర్బావిద్యాలయం విద్యార్థినులు, శ్రీవిద్యాన్ విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ నేవీ టీం సభ్యుడు కామేష్‌కు సన్మానం



కామేష్‌ని సత్కరిస్తున్న నునపర్తి వాసులు

అచ్యుతాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యుద్ధ నౌకల్లో పనిభారం తగ్గించే పరికరం తయారీలో విశాఖ టీంలో ఉండి బంగారు పతకం సాధించిన పెదపాటి కామేష్‌ని నునపర్తి గ్రామస్థులు ఆదివారం ఘనంగా సన్మానించారు. యుద్ధ నౌకల్లో పనిభారం, ఖర్చు తగ్గించే విధంగా డాక్ యార్డ్‌కు సంబంధించిన ఉద్యోగులు ముఖ్యమైన పరికరాన్ని తయారుచేసి వినియోగించడం ప్రారంభించారు. ఈ నైపుణ్యత దేశవ్యాప్తంగా వివిధ స్థాయిల్లో గుర్తింపు పొందడంతో ప్రపంచ స్థాయిలో జరిగిన పోటీలకు ఎంపికయ్యారు. ఇలా శ్రీలంకలో మూడు రోజుల పాటు 200 టీమ్‌లు పాల్గొనగా.. విశాఖ నేవీ టీం బంగారు పతకం సాధించింది. నౌకల్లో క్లిష్టతరమైన పనులను సైతం గుర్తించే విధంగా వీరు తయారు చేసిన పరికరం ఉపయోగపడుతుంది. ఏడుగురుతో కూడిన విశాఖ టీంలో నునపర్తికి చెందిన పెదపాటి కామేష్ కూడా ఉన్నారు. ఇది తమ గ్రామానికే గర్వ కారణం అంటూ నునపర్తికి చెందిన శ్రీరామ బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కామేష్‌ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వీవీ నగేష్, గొంప నరసింహనాయుడు, రెడ్డి శ్రీను, కన్నూరు ఎర్నాయుడు, రెడ్డి అప్పారావు, టి. వరంబాబు, ఎరుకునాయుడు తమ్మనాయుడు, రాజేష్ పాల్గొన్నారు.

సమష్టిగా సాగునీటి సంఘాల అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెదిరెడ్డి చిట్టిబాబు

పాయకరావుపేట రూరల్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన నాయకులు తోట నగేశ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి అన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో మండలంలోని నామవరంలో ఆదివారం భూమి కాలువ పరిధిలోని నాయకులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగునీటి కాలువల అభివృద్ధికి రాష్ట్ర హోంమంత్రి అనిత ఇప్పటికే 30 లక్షల రూపాయలు మంజూరు చేయించారన్నారు. రైతులు, నాయకులు అందరూ ఏకత్రాటిపై నిలబడి అభ్యర్థులను నిర్ణయించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొర్లె రాజుబాబు, కాశీవిశ్వనాథ్, మజ్జూరి నారాయణరావు, కురందాసు శివ, జనసేన నాయకులు గెడ్డం కన్నబాబు, గెడ్డం చైతన్య, బీజేపీ నాయకులు శ్రీరంగం రమేశ్, వేముల వెంకటేశ్వరరావు, కూటిమి నాయకులు, సర్పంచ్ పడాల సోమన్నదొర, వైసీపీ నాయకులు యిసరపు తాతారావు, పల్యాల లచ్చబాబు, రైతులు పాల్గొన్నారు.

సుందరపును కలిసిన ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు



ఎమ్మెల్యే విజయకుమార్‌కు ఆలయ బ్రోచర్‌ను అందజేస్తున్న కమిటీ సభ్యులు

మునగపాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను మునగపాక వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆదివారం కలిశారు. గ్రామంలో రూ.5కోట్లు అంచనాతో నిర్మిస్తున్న ఆలయం వివరాలు, నమూనాను ఎమ్మెల్యేకు వివరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల స్థాయిలో అద్భుత పుణ్య క్షేత్రంగా ఆలయం నిలిచే విధంగా నిర్మాణం జరుగుతోందని, నిర్మాణానికి ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా సహకారం అందించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బద్దెం సూర్యనారాయణ, సూరిశెట్టి రాము, టెక్కలి పరశరాం, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, వెలగా శ్రీనివాసరావు, పెంటకోట ఉమేష్, విల్లూరి నూక నర్సింగరావు తదితరులు ఉన్నారు.

అణుకు గ్రామానికి తారురోడ్డు వేయాలి



అణుకులో తారురోడ్డు కోసం నినాదాలు చేస్తున్న గిరిజనులు

కోటవురట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామానికి తారురోడ్డు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం అణుకు గ్రామంలో గిరిజనులతో కలిసి పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ ఆధ్వర్యంలో గిరిజనులు చేపట్టిన దీక్షలకు స్పందించి గ్రామానికి గత జిల్లా కలెక్టర్ మెటల్ రోడ్డు నిర్మించారన్నారు. అయితే ఆ రోడ్డు మొన్న కురిసిన భారీవర్షాలకు దెబ్బతిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే హోంమంత్రి అనిత అణుకు గ్రామానికి తారు రోడ్డు వేయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డేవిడ్, ఎం. సత్యనారాయణ ఎం. రాజేష్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

20 నుంచి వేంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు

ఎస్.రాయవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైభవ వేంకటేశ్వరస్వామి వారి 9వ దివ్య లీలా కల్యాణ మహోత్సవాలు ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 20వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి విష్వక్సేన పూజతో ప్రారంభమవుతాయన్నారు. ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. అధికసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాలకు తరలి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

నాలుగేళ్ల తర్వాత కొళాయిల ద్వారా తాగునీరు

ఎలమంచిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పరమేశ్వరి థియేటర్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే శ్యామలానగర్ ప్రాంత వాసులకు నాలుగేళ్ల తరువాత కొళాయిలు పనిచేస్తున్నాయి. దీంతో ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో తాగునీటి కొళాయిలు పనిచేయడం లేదని 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు ప్రచురించారు. స్థానికులు ఈ సమస్యను ఏఈ గణపతి సుబ్బారావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించడంతో తాగునీటి సరఫరా పైపులైనుకు మరమ్మతు పనులు చేయించడంతో సమస్య తీరింది.


పక్షవాత బాధితునికి ఆర్థిక సాయం

ఎలమంచిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మవరం వార్డుకు చెందిన జి. గణేష్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో పక్షవాతం వచ్చి మంచానికే పరిమితమైన గణేష్ కుటుంబానికి మనం చారిటబుల్ ట్రస్టు రూ. 25 వేలు ఆర్థిక సాయం చేసింది. మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు ఆదివారం గణేష్ తల్లికి ఈ చెక్‌ను అందజేశారు. గణేష్‌కు దివ్యాంగుల కోటాలో పెన్షన్ మంజూరు చేయిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రెసిడెంట్ మురుకుర్తి గోపి, వ్యవస్థాపక కార్యదర్శి పండూరి సురేష్, కోశాధికారి సీహెచ్ శ్యామలరావు, సభ్యులు పాల్గొన్నారు.

పిల్లలకు బహుమతులు పంపిణీ

అచ్యుతాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం మోసయ్యపేటలో పిల్లలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కన్వీనర్ ఆర్.లక్ష్మి, సర్పంచ్ పంచదార్ల పైడిరాజు, కట్టెంపూడి సతీష్, మారిశెట్టి వెంకట అప్పారావు, రొంగలి రాము తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా అభయాంజనేయ తీర్థం



ఆంజనేయస్వామివారిని దర్శించుకున్న పప్పల, ప్రగడ, భవాని, రంగనాయకులు, తదితరులు

రాంబిల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార గ్రామమైన వాడనర్సాపురంలో ఆదివారం అభయాంజనేయ తీర్థం కన్నులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించి పసుపు, కుంకుమలను నివేదించి పూజలు చేశారు. తమ మొక్కులను చెల్లించుకున్నారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, టీడీపీ రాష్ట్రకార్యదర్శి ధూళి రంగనాయకులు, గ్రామ సర్పంచ్ కె.రామారావు, టీడీపీ నాయకులు చెల్లూరి దేముడు, ఎరిపిల్లి అజయ్, అప్పలరాజు స్వామివారికి పూజలు చేశారు.

ఆంజనేయస్వామి ఆలయానికి ఇత్తడి గంట వితరణ

ఎలమంచిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ శ్రీరామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయంలోని ఆంజనేయస్వామి ఆలయానికి రామ్‌నగర్‌కు చెందిన బొద్దపు అప్పారావు, సత్యవేణి దంపతులు, కుటుంబ సభ్యులు ఇత్తడి గంటను అందజేసినట్టు కమిటీ ప్రతినిధులు హైరామ్, రమణ తెలిపారు. ఆంజనేయ ఆలయానికి వితరణ చేసిన భక్తుని కుటుంబానికి కాలనీ ప్రజలు అభినందనలు తెలిపారు.

ఉల్లాసంగా శ్రీప్రకాష్ స్పైస్



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

పాయకరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు శ్రీప్రకాష్ ఇంటర్ క్రియేటివ్ ఎనర్జీస్(స్పైస్) ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. ఆదివారం విద్యా సంస్థల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భానుమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న తోట నగేశ్

పాయకరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రీడింగ్ రూమ్‌లో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ తోట నగేశ్ ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు నారపురెడ్డి పద్మావతి, విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.సీతారామయ్య, తేజోమూర్తుల వెంకటేశ్వరరావు, అచ్యుతరావు, రామచంద్రరావు, షేక్ సలీం, లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో 132 మందికి పరీక్షలు

నక్కపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం భగవాన్ సత్యసాయిబాబా జయంతి వేడుకల్లో భాగంగా నక్కపల్లి సత్యసాయి భజన మండలి వారి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణా సంస్థ, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 132 మంది కంటి రోగులను వైద్యులు పరీక్షలు చేశారు. వీరిలో 35 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారందరినీ ప్రత్యేక వాహనంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు చేరుకొని అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే శివ, భవానీ, అయ్యప్ప భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

చోడవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం, ఆటల పోటీలు నిర్వహించారు. కె.కాలనీ స్కూల్ హెచ్ఎం గొల్లు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాయాధికారి జి.తిరుమలకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ: మండల కేంద్రంలోని శాఖా గ్రాంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వ్యాచరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రాజుబాబు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాలను చదివి విద్యాపరంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతీ ఆదివారం 'చదడం మాకిష్టం' అనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ప్రభుత్వ పెన్షనర్ల సంఘ సమావేశం రేపు

చోడవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్ల సంఘ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు సిరికి దేవానందం తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. సభ్యులంతా విధిగా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయ ఉద్యమ నేతలను స్మరించుకోవడం అదృష్టం

చీడికాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యమ నేతలను స్మరించుకోవడం అదృష్టంగా భావించాలని గ్రంథాలయాధికారి ఎంఎస్ఎల్.జోగేశ్వరి కోరారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ ఉద్యమ నేతలు గాడిచర్ల హరి, సర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్య, గ్రంథాలయ శాస్త్ర పితామహుడు రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమ నేతలకు విద్యార్థులు వందనాలు చేశారు. అనంతరం బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు.

మాడుగులలో...

మాడుగుల: మండల కేంద్రంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వై.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు బాబూరావు, ప్రసాద్, జగన్, రమేశ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డిసెంబరు 15న తూర్పుకాపు వనసమారాధన

చోడవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డూరు గ్రామంలో వచ్చే నెల 15న తూర్పుకాపు వనసమారాధన నిర్వహిస్తున్నట్టు తూర్పుకాపు రాక్స్ సంఘం అధ్యక్షుడు ఆకుల రమేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. వనసమారాధనకు సభ్యులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తూర్పుకాపు కాపు రాక్స్ సభ్యులు, యువజన సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో తాగునీటి బోర్లు ప్రారంభం

నాతవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినజగ్గంపేట, గుమ్మిడిగొండ గ్రామాల్లో న్యూలైప్ (నాసా) సంస్థ ప్రతినిధి రాజాకులపతి మైక్‌వైజర్ రెండు తాగునీటి బోర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మైక్‌వైజర్ మాట్లాడుతూ విద్యుత్ సరాఫరా లేని సమయాల్లో తాగునీటికి ఇబ్బందులు పడుతుండటంతో ఈ బోర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాసా సంస్థ సోషల్ వర్కర్ తాటిపాక శ్రీను, జిల్లా దళిత ప్రగతి ఐక్య సంఘం అధ్యక్షుడు కె.మరిడియ్య, దళిత ప్రగతి ఐక్య సంఘం మండల అధ్యక్షుడు సామర్ల రామారావు పాల్గొన్నారు.

సీతకండిలో మరో బోరు...

గొలుగొండ: ఏటిగైరంపేట పంచాయతీ పరిధిలోని సీతకండి గ్రామంలో తాగునీటి సమస్య తీర్చేందుకు ఎంపీటీసీ సభ్యులు చింతల కాంతం, సర్పంచ్ రామకృష్ణ కృషితో ఆదివారం బోరు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి బోరు ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణలో ఒకరికి గాయాలు

కొత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజోతి): ఇంటి మధ్య గోడ విషయమై తలెత్తిన ఘర్షణలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ దాసరి ఈశ్వరరావు తెలిపిన వివరాలివి. గవరపాలెం సంతోషిమాత ఆలయ సమీపంలో ఉన్న యల్లపు రమేష్‌నాయుడు ఇంటికి, అదే ఇంటి వెనుక ఉన్న బొడ్డేడ రాజా ఇంటికి మధ్య మందడిగోడ విషయమై వివాదం ఉంది. దీనిపై ఆదివారం ఇద్దరూ గొడవలు పడ్డారు. బొడ్డేడ రాజా కత్తితో దాడి చేయడంతో రమేష్‌నాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సాయంతో ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ దాడిలో రాజాకు సహకరించిన బొడ్డేడ పూర్ణచంద్రరావు, బొడ్డేడ సంతోష్‌లపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

యువతకు వరం.. గ్రంథాలయం



గ్రంథాలయంలో పోటీ పరీక్షల కోసం పుస్తకాలు చదువుకుంటున్న అభ్యర్థులు

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు నర్సీపట్నంలోని గ్రంథాలయం ఓ వరంగా మారింది. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచుతూ నిరుద్యోగులతో పాటు విద్యార్థులకు కూడా సువర్ణావకాశం కల్పిస్తోంది. ప్రత్యేక సదుపాయాలతో బాసటగా నిలుస్తున్నది. పనివేళల తర్వాతా చదువుకునే అవకాశం ఇస్తుండడంతో ఎక్కువ మంది యువతీ, యువకులు, విద్యార్థులు ఇక్కడ పుస్తకాలతో గడుపుతుండడం విశేషం.

- నర్సీపట్నంలో నిరుద్యోగులకు సువర్ణావకాశం
- పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు ప్రత్యేక సదుపాయాలు
- అందుబాటులో వివిధ రకాల పోటీ పరీక్షల పుస్తకాలు
- పని వేళల తర్వాత కూడా చదువుకునే అవకాశం
- విద్యుత్ సమస్య తలెత్తకుండా ఇన్వర్టర్ సౌకర్యం

నర్సీపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలి, అనకాపల్లిలో గ్రేడ్-1 గ్రంథాలయాలు ఉన్నాయి. నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో 2,557 మంది సభ్యత్వం కలిగిన పాఠకులు ఉన్నారు. వీరికి 13,866 రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఎక్కడా లేని సదుపాయాలు ఇక్కడ గ్రంథాలయంలో సమకూరాయి. కార్పొరేట్ తరహాలో అన్ని సౌకర్యాలతో గ్రంథాలయం ఉంటుంది. దీంతో పోటీ పరీక్షలకు తర్ఫీదు పొందే నిరుద్యోగ యువతీ, యువకులు, విద్యార్థులు ఎక్కువ సమయం గ్రంథాలయంలోని పుస్తకాలతో గడుపుతున్నారు.

ఉదయం 11 నుంచి 4 గంటల వరకు అవకాశం

గ్రంథాలయం పనివేళలు ఉదయం 8 నుంచి 11, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు తెరిచి ఉంటుంది. విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా గ్రంథాలయాధికారి దమయంతి ఉన్నతాధికారులతో మాట్లాడి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4 గంటలు వరకు గ్రంథాలయంలోని హాలులో చదువుకోవడానికి అవకాశం కల్పించారు. వారికి అవసరమైన అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, కరెంట్ ఎఫైర్స్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యుత్ సమస్య తలెత్తినా విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉండటానికి ఇన్వర్టర్ వేయించారు. దీంతో విద్యుత్ పోతుందన్న భయం లేకుండా విద్యార్థులు చదువుకుంటున్నారు.

ఐఏఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ విద్యార్థులు కోసం రూ.30 వేలు విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలు, కుర్చీలు, పుస్తకాలు పెట్టుకునే అల్మారాలు వితరణ చేశారు. మహిళలు, పురుషులు, పిల్లలు వేర్వేరుగా చదువు కోవడానికి ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశారు. దీనివల్ల పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఏకాగ్రత కోల్పోకుండా చదువుకుంటున్నారు. త్వరలో దాతల సహాయంతో ఆర్వో ప్లాంట్ కూడా సమకూరబోతుంది. అందుకే ఈ గ్రంథాలయం తమకు ఓ వరంలా భావిస్తున్నామని నిరుద్యోగ యువత, విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



గ్రంథాలయంలోని అల్మారాల్లో పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ రకాల పుస్తకాలు

పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి

▸▸ మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రాజు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులంతా పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం పంచాయతీలకు నిధులు పుష్కలంగా మంజూరు చేస్తున్నదన్నారు. నిధుల కొరత సమస్య తలెత్తదని, లక్ష్యాల మేరకు అవసరమైన పనులు సకాలంలో పూర్తిచేసేలా అందరూ చొరవ చూపించాలని కోరారు. అంతకుముందు ఎంపీటీసీ సభ్యురాలు గూనూరు ధనలక్ష్మి మాట్లాడుతూ, పాఠశాలల సమీపంలో గంజాయి విక్రయాలు సాగుతున్నాయని, వాటిపై దృష్టిసారించాలని, పాఠశాలలు తనిఖీ చేయాలని ఎంఈవోను కోరారు. జ్యోతిబాపూలే స్కూల్‌లో ప్రిన్సిపాల్ సహా ఇతర సిబ్బంది కుమ్మక్కై పిల్లలను సరిగా పట్టించుకోకపోవడం, పిల్లలను చూడడానికి వచ్చే తల్లిదండ్రులను తిడుతున్నారని, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో బోధన సరిగా ఉండదని విద్యార్థులు ఇతర పాఠశాలలకు వెళ్లిపోతున్నారని, ఆ స్కూల్ పనితీరుపై దృష్టిసారించాలని అంకుపాలెం సర్పంచ్ చందు రాంబాబు కోరారు. గౌరీపట్నం పంచాయతీలో పాఠశాలలకు ప్రహరీ నిర్మాణంలో అధికారులు చొరవ చూపించాలని ఎంపీటీసీ సభ్యుడు మంగా జగన్నాథరావు సూచించారు. గాంధీగ్రామంలోని వ్యవసాయ శాఖ ఉద్యోగిని జన్నవరం డిప్యుటేషన్‌పై పంపించారని, ఇక్కడ జీతం ఇస్తూ వేరే చోట ఎలా పనిచేయిస్తారని సర్పంచ్ ప్రశ్నించారు. ఆ ఉద్యోగిని గాంధీగ్రామం తెప్పించాలని డిమాండ్ చేశారు. జన్నవరంలో పంటభూములకు వచ్చే కాలువలో పూడికతీత విషయంలో ఉపాధి సిబ్బంది సరిగా స్పందించడం లేదని, గృహ నిర్మాణ లబ్ధిదారుల విషయంలో హౌసింగ్ అధికారులు తమకు సమాచారం ఇవ్వడం లేదని జన్నవరం సర్పంచ్ సన్యాసిరావు తెలిపారు. దీనిపై ఎంపీడీవో ఆంజనేయులు మాట్లాడుతూ, స్థానిక ప్రజాప్రతినిధులకు అన్ని శాఖల అధికారులు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, తహసీల్దార్ అంబటి రామారావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలి

▸▸ కూటమి ప్రభుత్వం మేలు చేస్తుందని ఆశగా ఎదురుచూపులు

▸▸ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయి


సమావేశంలో మాట్లాడుతున్న చినబ్బాయి

అనకాపల్లిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ కమిషన్‌ను తక్షణమే నియమించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఫెడరేషన్ ఆఫీసు బ్యారర్ల సమావేశంలో మాట్లాడారు. గత పీఆర్‌సీ కాల పరిమితి పూర్తయి పదహారు నెలలు గడిచిందన్నారు. నూతన ప్రభుత్వం పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం పీఆర్‌సీ కమిషనర్‌గా మన్మోహన్‌సింగ్‌ను నియమించినా ఉద్యోగులకు ఎలాంటి ఐఆర్ ప్రకటించకుండా కాలయాపన చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు చేస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు నెల్లి సుబ్బారావు, అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు సూర్యప్రకాష్, పి.చంద్రరావు, రమేష్‌రావు పాల్గొన్నారు.


ఎం.అలమండలో వన మహోత్సవంలో చిన్నారులతో ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి

సత్య సాయిబాబా సేవలు ఆదర్శనీయం: ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సత్య సాయిబాబా మానవాళికి అందించిన సేవలు ఆదర్శనీయమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని ఎం.అలమండలో ఆదివారం నిర్వహించిన వన మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెనందిపల్లిలో సత్య సాయిబాబా జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాబాను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం సత్యసాయి సేవా భక్తుడు సశిభూషణ్‌రావు ఆధ్వర్యంలో కేకు కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పోతల పాత్రునాయుడు, గొర్లె సన్యాసినాయుడు, చెరకాన సూర్యనారాయణ, గొర్లె గోవింద తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పడాల


కొండలరావును సత్కరిస్తున్న నాయకులు

మాడుగుల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జిగా పడాల కొండలరావు నియమితులయ్యారు. ఎం.కోడూరు గ్రామానికి చెందిన పడాల కొండలరావు కాంగ్రెస్ పార్టీ వీరాభిమానిగా గుర్తింపు పొందారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తూ వచ్చారు. నీటిసంఘం, పీఏసీఎస్‌ల పదవులను చేపట్టి ఎన్నో సేవలు అందించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సుబ్బన్న తనను మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమిస్తూ నియామక పత్రాన్ని ఇచ్చారని కొండలరావు తెలిపారు. పార్టీ అభివృద్ధికి మరింత పాటు పడతానన్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అతన్ని సన్మానించారు.

అల్లూరి పార్కులో పర్యాటకుల సందడి


స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల వద్ద విద్యార్థులు, పర్యాటకులు

కృష్ణాదేవిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరిసీతారామరాజు పార్కు ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. కార్తీక మాసం ఆదివారం కావటంతో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు, విద్యార్థులు పార్కుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా పార్కులోని స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, గంటందొరల సమాధులను సందర్శించి పూలతో సమాధులకు నివాళులర్పించారు. ఇక్కడ పార్కులో పచ్చని మొక్కలు, ఇతర అందాలను ప్రకృతి సౌందర్యాలను పర్యాటకులు తిలకించి ఆటపాటలతో గడిపారు. ఆనంతరం ఇక్కడ వన భోజనాలు చేశారు. పెద్దలు, చిన్నారులు, యువకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉల్లాసంగా గడిపారు. అయితే పార్కులో సేదతీర్చుకునే నాలుగు ప్రగోడాలను మరమ్మతు చేయాలని, తాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటుచేయాలని అధికారులను, పాలకులను పర్యాటకులు కోరుతున్నారు.

బలిఘట్టం చెక్‌పోస్టు వద్ద గొడవ

నర్సీపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం చెక్‌పోస్టు సమీపంలో కొంత మంది యువకులు బీభత్సం సృష్టించారు. పట్టణ సీఐ గోవిందరావు అందించిన వివరాల ప్రకారం... ఆదివారం బలిఘట్టం చెక్‌పోస్టు సమీపంలో మునిసిపాలిటీకి చెందిన చింతల గణేశ్, బేరా శివ, బాలరాజు తదితరులు వచ్చే పోయే వాహనాలను ఆపి స్థానికులను అసభ్యకరంగా తిడుతూ గొడవ చేశారని, అడ్డు కోవడానికి వెళితే తనను చంపుతామని బెదిరించారని పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకట రమణ ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని సీఐ గోవిందరావు తెలిపారు. అదే గొడవలో ఆటో ముందు గ్లాసు పగిలి పోవడంతో ఆటో యజమాని ఎం.సత్యనారాయణ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఫిర్యాదులపై విచారణ చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

కశింకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కన్నూరుపాలేనికి చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలివి. మాకవరపాలెం మండలం సుభద్రయ్యపాలేనికి చెందిన రమ్య (25)కు కశింకోట మండలం కన్నూరుపాలెం గ్రామానికి చెందిన కూండ్రపు వరప్రసాద్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. అయితే ఆదివారం ఉదయం పదకొండు గంటల సమయంలో ఇంట్లో ఉన్న ఫ్యాన్ హుక్కుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. కాగా మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. రమ్య తల్లి చిన్నతల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ఆర్థిక సంక్షోభంతో అధిక ధరలు

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు బి.ప్రభావతి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నేత ప్రభావతి

చీడికాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంక్షోభం కారణంగా ధరలు పెరిగిపోతున్నాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు బి.ప్రభావతి అన్నారు. మండలంలో కోనాం పంచాయతీ కొండ్లకొత్తూరు గ్రామంలో సీపీఎం మండల మహాసభ సమావేశం ఆదివారం జరిగింది. ముందుగా సీపీఎం జెండాను రంగసింగి పెద్దన్నదొర ఆవిష్కరించారు. మరో గిరిజన నాయకుడు నంబారు రమ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశంలో ఆర్థిక సంక్షోభం ఉందని, దీంతో విపరీతంగా ధరలు పెరుగుతున్నాయని చెప్పారు. యువతకు ఉద్యోగాలు రావడం లేదని, మరోవైపు ఉన్న కంపెనీలు మూతపడుతున్నాయని వాపోయారు. సంక్షోభం నుంచి బయట పడటానికి పెట్టుబడిదారులు ప్రజలపై భారం మోపుతున్నారని చెప్పారు. సామాన్యులపై భారాలు మోపుతూ పెత్తందారులకు కొమ్ముకాస్తున్నారన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు, నాయకులు ఆర్.శంకరరావు, ఎం.రమణ, సిహెచ్.శ్రీనివాసరావు, కన్నబాబు పాల్గొన్నారు.

పైపులైన్ లీకులతో తాగునీరు వృథా


పైపులైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

మాకవరపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర ఉన్న పైపులైన్ పగిలిపోయింది. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. లచ్చన్నపాలెం సర్పానదిలో రూ.10 కోట్లతో నిర్మించిన భారీ తాగునీటి ప్రాజెక్టు ద్వారా మాకవరపాలెం, తామరం, రాచపల్లి, జి.కోడూరు, కొత్తపాలెంతో పాటు మరికొన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పైపులైన్ పగిలిపోయి తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇలాగే వదిలివేస్తే మరికొద్ది రోజుల్లో నీటి ప్రవాహనికి పైపులైన్ మరింత పాడవుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతు చేయాలని వారు కోరుతున్నారు.

కింతలిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు


హైస్కూల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రజాప్రతినిధులు

మాడుగుల రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కింతలి పాఠశాలలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సపోర్టర్స్ కమిటీ ప్రతినిధులు సొంత నిధులతో ఈ విగ్రహం సమకూర్చారు. సర్పంచ్ షైచర్ల సన్యాసిరావు, ఉప సర్పంచ్ అప్పాన నారాయణరావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు అప్పారావు, కుదర నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి సియ్యాద్రి శ్రీనివాసరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

'అక్రమ క్వారీలకు అడ్డుకట్ట వేయాలి'

దేవరాపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకపల్లి, మారేపల్లి, చిన గంగవరం, తదితర ప్రాంతాల్లో అక్రమ క్వారీలకు అడ్డకట్ట వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. నిర్వాహకులు ఇచ్చే మామ్మూళ్లు తీసుకుంటూ పట్టించుకోకుండా వదిలేస్తున్న అధికారులపైనా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పోలీసుల అదుపులో నకిలీ నోట్లు మార్పిడి ముఠా


పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లు

లంకెలపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐదు వందల రూపాయల నకిలీ నోట్లు మార్పిడి చేస్తున్న నలుగురు వ్యక్తులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. కాకినాడ జిల్లా ముమ్మడివరం ప్రాంతానికి చెందిన గుత్తుల విశాల్, అతని మామయ్య శీలం శ్రీను కొబ్బరి కాయల వ్యాపారం చేస్తుంటారు. ఎప్పటిలాగే శుక్రవారం వ్యాన్‌లో కొబ్బరికాయలను తీసుకొచ్చి విశాఖపట్టణంలోని ఎన్ఏడీ ప్రాంతంలో విక్రయించారు. తిరుగు ప్రయాణంలో లంకెలపాలెం జంక్షన్‌లో ఆగి ఇరువురూ టీ తాగుతున్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వచ్చి విశాల్‌కు నాలుగు నకిలీ ఐదు వందల నోట్లు ఇచ్చి చిల్లర కావాలని అడిగాడు. దీంతో అతడు వంద నోట్లు ఇచ్చాడు. కాసేపటి తర్వాత నోట్లుపై చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ఉండడాన్ని గుర్తించి వెంటనే పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నకిలీ నోట్లు మార్పిడి చేస్తున్న నలుగురు వ్యక్తులను మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద ఉన్నట్టు గుర్తించారు. ఎస్ఐ కృష్ణారావు సిబ్బందితో వెళ్లి సదరు ముఠాను శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు నకిలీ ఐదు వందల నోట్లు, 20 అసలు వంద నోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ పరవాడ సీఐ మల్లికార్జునరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థికి వినికిడి యంత్రం వితరణ

» ఉపాధ్యాయుడి ఉదారత



విద్యార్థికి వినికిడి పరికరాన్ని అందిస్తున్న ఉపాధ్యాయుడు బాలకృష్ణ

పెదబయలు, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): తరగతిలో ఓ విద్యార్థి వినికిడి లోపంతో పాఠాలు వినలేకపోవటాన్ని గుర్తించిన ఉపాధ్యాయుడు తన సొంత ఖర్చుతో ఆ చిన్నారికి వినికిడి పరికరాన్ని వితరణ చేసి ఉదారత చాటుకున్నారు. మండలంలోని సీతగుంటలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1లో తొమ్మిదో తరగతి చదువుతున్న జర్సింగి ఏలియా పుట్టుకతోనే వినికిడి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. చదువుతోపాటు ఆటలలో చురుకుగా ఉండే ఏలియా.. కుటుంబం ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు చెండా బాలకృష్ణ సొంత ఖర్చుతో వైద్య పరీక్షలు చేయించారు. వినికిడి పరికరాన్ని కొనుగోలు చేసి అందించారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సహచర ఉపాధ్యాయులు బాలకృష్ణను అభినందించారు.

అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి ఇంటర్వ్యూలు రేపు

చింతపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి తెలిపారు. ఈ పోస్టు భర్తీకి ఎమ్మెస్సీలో 55శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. నెట్, స్లెట్, పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గూడెంకొత్తవీధి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని టీడీపీ జిల్లా కార్యదర్శి ముక్కలి మహేశ్ అన్నారు. ఆదివారం కుంకుంపూడి, అగ్రహారం గ్రామాల్లో విద్యార్థులకు పుస్తకాలు, రాతసామగ్రిని ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఎదగాలన్నారు. ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు గంట బుజ్జిబాబు, తెలుగు మహిళా మాజీ అధ్యక్షురాలు ముక్కలి రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొర్రా గుహల వద్ద పార్కింగ్ సమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

అనంతగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మన్యంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు తిలకించేందుకు వచ్చే పర్యాటకులు, పార్కింగ్ సమస్యతో సతమతమవుతున్నారని, ఈ నేపథ్యంలో సమస్య పరిష్కరించాలని జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు అధికారులను కోరారు. ఆదివారం బొర్రా గేటు వలస, బొర్రాగుహలు వద్ద పార్కింగ్ ప్రదేశాలను తహసీల్దార్ మాణిక్యంతో కలిసి పరిశీలించారు. పర్యాటకులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నా, స్థలం లేక ఒకరికొకరులు వాగ్వాదానికి దిగుతున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో టోల్‌గేటును అనుకుని 1.5 సెంట్ల స్థలం చదువునుచేయించి సమస్యలేకుండా అధికారులు చొరవచూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలోని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చిట్టం మురళీ, రమేష్, దేవన్న, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

అనంతగిరి, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని భీంపోల్ పంచాయతీ కేంద్రం నుంచిసరియాపల్లి రోడ్డు పనులకు ఆదివారం సర్పంచ్ భీమలమ్మ, కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భీమలమ్మ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గిరిజన గ్రామాలకు మంచిరోజులు వచ్చాయన్నారు.

'మినీ అంగవాడీలు మెయిన్ కేంద్రాలుగా మార్పునకు చర్యలు'

పాడేరురూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి ఎస్. సూర్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాలుగా మార్పుచేయాలని డిమాండ్ చేస్తూ కార్యకర్తలు ఈ నెల 16వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో చేపట్టిన ధర్నాలకు ప్రభుత్వం స్పందించి ఈ మేరకు నిర్ణయించినట్టు ఆమె వివరించారు.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204

డోలీల మోత దుస్థితి మారేదెన్నడో?

» గర్భిణులు, రోగులు ఆస్పత్రులకు వెళ్లేందుకు నిత్యం యాతన
» గిరిజన గ్రామాల్లో పరిస్థితి
» రహదారి సౌకర్యంలేక అవస్థలు
» సకాలంలో అందని వైద్య సేవలు



అటవీశాఖ అనుమతులు లేకనిలిచిన కర్రిగుడ- నిమ్మగుంట రోడ్డు (ఫైల్)

అనంతగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో గిరిజనులకు డోలీమోతలు తప్పడం లేదు. కిలోమీటర్ల మేర డోలీలతో రోగులను, గర్భిణులను ఆస్పత్రులకు తరలించాల్సిన దుస్థితి నెలకొంది. గత ఆగస్టులో కళ్యాణగుమ్మి గ్రామానికి చెందిన మామిడి రంభ (39) మలేరియా జ్వరంతో తీవ్ర అస్వస్థతకులోనైంది. ఆమెను గ్రామం నుంచి ఆరు కిలో మీటర్లు డోలీమోతపై సమిధ వరకు తీసుకువచ్చి, అక్కడ నుంచి ఎస్. కోట ఆస్పత్రికి తరలించారు. అదే నెలలోని కర్రిగుడ గ్రామానికి బడ్నాయిన రాములమ్మ అనే నిండు గర్భిణిని డోలీపై కు టుంబ సభ్యులు తరలించారు. ఈ మోత కారణంగా ఆమె బిడ్డ కడుపులోనే మృతిచెందింది. అలాగే, కొర్రా రాధమ్మ పురిటినొప్పులు అధికమవ్వడంతో కుటుంబ సభ్యులు సుమారు 8 కిలో మీటర్లు డోలీపై నిమ్మగుంట వరకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి ఆస్పత్రికి తరలించారు. అదే గ్రామానికి చెందిన బడ్నాయిన కుమార్ గిరిజనుడు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురికావడంతో నాలుగు రోజు ల కిందట కుటుంబ సభ్యులు డోలీమోతపై తరలించారు. క్షేత్రస్థాయిలో వైద్యసేవలందకపోవడంపై గిరిజనులు మండిపడుతున్నారు. వాస్తవానికి ప్రసవ సమయానికి ముందుగానే గర్భిణులను ఆస్పత్రికి తరలించి, వైద్యసేవలందించాలని, వైద్యశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలున్నా, పూర్తిస్థాయిలో అమలుకాకపోవడం.. మరోవైపు గిరిజనులకు అవగాహన కల్పించడంలో విఫలం కావడంతో పురిట్లోనే చిన్నారులు మృతిచెందుతున్నారు..

అధికారులకూ తప్పని అవస్థలు

డోలీమోతలపై సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేయడం అదికాస్తా.. అధికారులు చేరడంతో మండలస్థాయి అధికారులు ఎంపీడీవో ఏవీవీ.కుమార్, తహసీల్దార్ మాణిక్యం, ఇతర అధికారులతో కలిసి మూడురోజుల కిందట కర్రిగుడ గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గ్రామంనుంచి తిరుగుప్రయాణంలో ఎంపీడీవో అస్వస్థతకు లోనవ్వడంతో డోలీమోతపైనే ఆయనను గిరిజనులు మోసుకురావాల్సి వచ్చింది.

నిధులు మంజూరు... రోడ్డు నిర్మాణంలో జాప్యం

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం సమిధ పంచాయతీ.. నేరలపూడి నుంచి కొట్టంగుడ మీదుగా కడరేవ్ వరకు జీఎస్‌బీ రోడ్డు.. అక్కడ నుంచి కర్రిగుడ మీదుగా నిమ్మగుంట డబ్ల్యూబీఎం రోడ్డుకు ఉపాధి పథకం నుంచి రూ. 6.50 కోట్లు మంజూరయ్యాయి. ఆయా గ్రామాలను కలుపుతూ 26 రీచ్‌లు 12 కిలో మీటర్ల రోడ్డు సౌకర్యం కల్పించనున్నారు. రోడ్డుకు నిర్మాణానికి సంబంధించి, అటవీ శాఖ అనుమతులు ఈ ఏడాది ఆగస్టు నెలలోనే డిస్ట్రిక్ లెవల్ కమిటీ ఆమోదం కూడా తెలిపింది.. అయితే, ప్రొసిండింగ్ కాపీ అందకపోవడంతో క్షేత్రస్థాయిలో పనులకు ఆటంకం నెలకొంది.

లాంఛనంగా పనులు ప్రారంభం...

అటవీ అనుమతులు రావడంతో పాటుగా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు.. రోడ్డు పనులు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు సౌకర్యం కల్పించేలా అన్ని చర్యలు చేపడతున్నాం.. రోడ్డు సౌకర్యంతో ఆయా గ్రామాల గిరిజనులకు రవాణా కష్టాలు తీరనున్నాయి.

– గణేశ్, ఏఈ గిరిజన సంక్షేమశాఖ, అనంతగిరి

నారా రామ్మూర్తినాయుడు మృతికి సంతాపం



రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పాడేరురూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్య క్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతికి పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సంతాపం తెలిపారు. ఆదివారం కుమ్మరిపుట్టులోని ఆమె నివాస గృహం వద్ద టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, మహిళా ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, తెలుగు యువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, నాయకులు బుద్ద జ్యోతికిరణ్, బుక్క జగదీశ్, దుంబేరి విశ్వనాథం, మాజీ ఎంపీపీ ఎస్‌వీవీ రమణమూర్తి, బూరెడ్డి రామునాయుడు, జనసేన పార్టీ నాయకులు డి.జగన్, బి.నాని, వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: నారా రామ్మూర్తినాయుడుకి మృతికి టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. ఆదివారం మండల కేంద్రంలో రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన రాజకీయ జీవితాన్ని నాయకులు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నాయకులు లక్ష్మణరావు, కేశ్వరరావు, హరి, మోహన్, మహేంద్ర పాల్గొన్నారు.

'కస్తూర్బా' ఉపాధ్యాయినికి ఉత్తమ పురస్కారం



అవార్డు అందుకుంటున్న కృష్ణకుమారి

డుంబ్రిగుడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గాంధీ గురుకులబాలికల విద్యాలయం ఉపాధ్యాయిని కృష్ణకుమారికి ఉత్తమ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ వారు అల్లూరి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కృష్ణకుమారిని ఎంపిక చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె సొసైటీ చైర్మన్ డాక్టర్ పటన్నం కమల మనోహర్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు.

రుషికొండ ప్యాలెస్‌ను రాష్ట్ర మ్యూజియంగా మార్చాలి

» బుద్ధిష్టి మాన్యుమెంట్స్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్యరాజు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బుద్ధిష్టి కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని రుషికొండపై నిర్మించిన ప్యాలెస్‌ను రాష్ట్ర మ్యూజియంగాప్రకటించాలని బుద్ధిష్టి మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.మల్లయ్యరాజు, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పీఎంఆర్సీ భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖలోని బావికొండ, తొట్లకొండ, పావురాళ్లకొండతోపాటు పవిత్రమైన రుషికొండలు ఉన్నాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు, విశాఖ వాసులు ఈ కొండలను భక్తి, గౌరవ భావాలతో చూస్తారన్నారు. ఆ ప్రాంతం బౌద్ధ, జైన్ రుషులకు ఆలవాలమైంది. రుషికొండపై గతంలో టూరిజం బిల్డింగ్‌లు ఉండేవి. గత వైసీపీ ప్రభుత్వం వాటిని తొలగించి ప్యాలెస్‌ను ఏర్పాటు చేశారన్నారు. వాటిని ప్రజల పరం చేసి తెలుగు జాతి గొప్పతనాన్ని ఇనుమడించేలా మ్యూజియంగా మార్పుచేయాలని కోరారు. రాష్ట్ర విడిపోయిన తరువాత మనకుచెందిన శిల్ప కళాఖండాలు, విశాఖలో దొరికిన బుద్ధుని అవశేషాలు హైదరాబాద్‌లో ఉన్నాయని, వాటిని విశాఖకు తీసుకురావాలని కోరారు.

చిత్రకళా పోటీలు



గ్రంథాలయంలో చిత్రకళా పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

డుంబ్రిగుడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల భాగంగా స్థానిక గ్రంథాలయంలో నాలుగో రోజు ఆదివారం విద్యార్థినులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కేజీబీవీ, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలల నుంచి సుమారు వంద మంది విద్యార్థినులు పాల్గొన్నారు. చదువుతోపాటు, చి త్రకళ, ఇతర అంశాల్లోనూ విద్యార్థులు నైపుణ్యత పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది సుబ్బారావు పాల్గొన్నారు.

విజ్ఞానానికి గ్రంథాలయాలు దోహదం



విద్యార్థులతో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ భారతి

చింతపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి అన్నారు. ఆదివారం కళాశాలలో గ్రంథాలయం వారోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 20తేదీ వరకు గ్రంథాలయం వారోత్సవాలను కళాశాలలో నిర్వహించనున్నట్టు చెప్పారు. విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు గ్రంథాలయంలో లభించే పుస్తకాలు, దినపత్రిలు క్రమంగా చదవడం వల్ల పోటీ పరీక్షల్లో రాణించవచ్చునన్నారు. ప్రతి విద్యార్థి కొంత సమయం గ్రంథాలయంలో గడపాలన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసపాత్రుడు, డాక్టర్ కేజియ, లీల పావని, గ్రంథాలయం అధికారి జగ్గత్‌రాయ్ పాల్గొన్నారు.

విజయవంతంగా శాఖా గ్రంథాలయ వారోత్సవాలు

పాడేరురూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాడేరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయాధికారిణి ఎం.సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచనతో పాటు లెమన్ స్పూన్ పోటీలు, మ్యూజికల్ చైర్, పాటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజేతలకు ముగింపు రోజున బహుమతులను అందిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయ, అధ్యాపకులకు న్యాయం చేయాలి

» సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్ డిమాండ్



శిబిరంలో మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

పాడేరురూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో గత 15 ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపకులను కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉద్యోగులు (సీఆర్టీలు)గా మార్పు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. గురుకుల ఉపాధ్యాయ, అధ్యాపకులు ఐటీడీఏ కార్యాయం ఎదుట సమస్యలపై రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ గురుకుల అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్య పరిష్కారమయ్యేంత వరకు ఈ దీక్షలకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అవుట్ సోర్సింగ్ అటెండర్, డ్రైవర్‌కి ఇచ్చే వేతనం కూడా గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఇవ్వకపోవడం అత్యంత దారుణమని అన్నారు. అవుట్ సోర్సింగ్ అటెండర్‌కు నెలకు రూ. 15 వేలు వేతనం చెల్లిస్తున్న ప్రభుత్వం ఫిజికల్ టీచర్‌కు రూ. 10,900, టీజీటీ టీచర్‌కు రూ. 14,800 చెల్లిస్తుందన్నారు. అవుట్ సోర్సింగ్ డ్రైవర్‌కు రూ. 18,500 వేతనం చెల్లిస్తున్న ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ జూనియర్ లెక్చరర్‌కు నెలకు రూ.18 వేలు చెల్లించడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించి వారికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏపీ. గిరిజన సంక్షేమ గురుకులాల అవుట్ సోర్సింగ్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. కొండబాబు, ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీలో ప్రస్తుతం అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు చేపడుతున్న తమ 1,143 పోస్టులు కలపటం వల్ల భవిష్యత్తులో తాము ఉపాధి కోల్పోయి వీధిన పడాల్సిన పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో మూడేళ్లుగా అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గత ప్రభుత్వం 2022లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్‌గా మార్పు చేసి 15 ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న తమకు అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు, ఎల్. సుందరరావు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

» పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



చింతపల్లి టీడీపీ నాయకులతో సమావేశమైన పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. శనివారం పాడేరు పార్టీ కార్యాలయంలో మండలానికి చెందిన టీడీపీ నాయకులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వాలను లక్ష్యంగా నిర్దేశించినట్టు చెప్పారు. చింతపల్లి మండలంలో 10 వేల మందిని చేర్పించాలని కోరారు. కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రతి పార్టీ అభిమానులను సభ్యులుగా చేర్పించాలన్నారు. పార్టీ సభ్యత్వం పొందిన వారికి రూ.ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలన్నారు. అలాగే, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటినుంచి పునాది వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నాయకులు పెదిరెడ్ల బేతాళుడు, అబ్బాయినాయుడు, లక్ష్మణ్‌రావు, కేశ్వరరావు, అర్జున్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



అమ్మవారి దర్శనానికి క్యూకట్టిన భక్తులు

పాడేరురూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాల భక్తులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంనుంచి అరకిలో మీటరు మేర బారులు తీరారు. మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి ఘటాలను సమర్పించి మొ క్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకొని బంధు మిత్రులతో కలిసి భోజనాలు చేశారు. అలాగే, అమ్మవారిని వందలాది మంది అయ్యప్ప, శివ మాలధారులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, ఆలయ, ప్రసాద కమిటీ ప్రతినిధులు దన్నేటిపలాసి రాము, రమణ తదితరులు పాల్గొన్నారు. పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద గల అమ్మవారి పాదాల వద్దకు వెళ్లి మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నగర పంచాయతీగా అచ్యుతాపురం?

... 5వ పేజీ తరువాయి

పంచాయతీలను కలిసి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేయాలని నాటి టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో దీని గురించి పట్టించుకోలేదు. ఇప్పుడు టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వుండడంతో నగర పంచాయతీ ఏర్పాటుపై కదలిక వస్తుందని స్థానికులు భావిస్తున్నారు. అధికారులు గణాంకాల ప్రకారం అచ్యుతాపురం, చోడపల్లి, జంగులూరు, భోగాపురం, వెదురువాడ పంచాయతీల్లో జనాభా 50 వేల వరకు వుంటుందని అంచనా. రానున్న రోజుల్లో ప్రత్యేక ఆర్థిక మండలిలో ఎన్‌టీపీసీ భారీ గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. సుమారు 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఎస్ఈజడ్‌లో మరెన్నో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. దీంతో రానున్న ఐదేళ్ల కాలంలో ఇక్కడ జనాభా లక్షకు చేరుకున్నా ఆశ్చర్యపడాల్సిన పనిలేదని స్థానిక నేతలు అభిప్రాయపడుతున్నారు.

రైల్వేలో కలకలం

... 5వ పేజీ తరువాయి

కోరారు. ఈ మేరకు ముంబైలో డబ్బు ఇస్తుండగా అప్పటికే అందిన సమాచారంతో సీబీఐ అధికారులు పట్టుకున్నారు.

అసలేం జరిగింది...

గత డీఆర్ఎంలతో పోల్చితే సౌరబ్‌ప్రసాద్ వ్యవహారశైలి భిన్నంగా ఉంటుందని సిబ్బంది చెబుతున్నారు. ఇక్కడ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తన చాంబర్‌లోకి ఇతరులను పరిమితంగా అనుమతించేవారని, శాఖాధికారులు మినహా ఇతరులు, కాంట్రాక్టర్లను రానివ్వలేదని సమాచారం. తన స్థాయిలో చేయాల్సిన పనులను మినహాయిస్తే మిగిలిన వాటికి సంబంధిత అధికారికి సిఫారసు చేసేవారని తెలిసింది. గత డీఆర్ఎం మాదిరిగా సిబ్బందిపై చర్యలు తీసుకోవడం, బదిలీలు చేయడం, అర్హత లేనివారికి సహకరించేవారు కాదంటున్నారు. వివిధ మార్గాల్లో ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించే వారిని కూడా డీఆర్ఎం దూరం పెట్టేవారని, కీలక అంశాల్లో ఆచితూచి నిర్ణయాలు తీసుకునేవారని సమాచారం. దీంతో కొంతమందిలో వ్యతిరేకత వచ్చిందంటున్నారు. అయితే కొందరికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చిన నేపథ్యంలో తన అనుచరులతో ఇలాంటి లావాదేవీలు జరిపి ఉంటారని మరికొంతమంది అభిప్రాయపడుతున్నారు.

వరిపై క్రిమికీటకాలు దాడి

... 5వ పేజీ తరువాయి

చేతికవచ్చే తరుణంలో కూడా తెగుళ్ల సోకడం ఇప్పుడే చూస్తున్నా మని అంటున్నారు. ఈ ఏడాది వర్షాలు సంతృ ప్తికరంగానే కురిసి, వాతావరణం అనుకూ లంగా వుండడంతో వరి పంట బాగానే పం డిందని, దిగుబడి కూడా ఆశాజనకంగా వుం టుందని భావిస్తున్న తరుణంలో కత్తెర పురుగు, సుడిదోమ ఆశించి నష్టాన్ని కలుగ జేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. కాగా గింజ దశలో వున్న వరి పైరును ఆశించిన తెగుళ్ల గురించి మండల వ్యవసాయ అధికారి డి.రూప దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా.. నివారణ చర్యల కోసం ఆమె పలు సూచనలు చేశారు. కత్తెర పురుగు దాడి విషయాన్ని ఇప్పటికే పలువురు రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ పురుగులు చాలా వేగంగా వ్యాప్తి చెంది, వరి వెన్నులను కొరికివేస్తాయన్నారు. కత్తెర పురు గులు పగటిపూట వరి దుబ్బుల మొదళ్లలో వుంచి, చీకటి పడిన తరువాత బయటకు వచ్చి వరి వెన్నులను కొరికివేస్తాయని ఆమె వివరించారు.

కత్తెర పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ మందును లీటరు నీటిలో 0.5-1.0 గ్రాముల చొప్పున కలిపి ఎకరానికి 100 నుంచి 150 లీటర్ల వరకు మందు నీటిని పిచికారీ చేసుకోవాలన్నారు. లేకపోతే ప్రొఫెనోఫాస్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున ఎకరానికి 200 లీటర్ల మందునీటిని పిచికారీ చేయాలని సూచించారు.

సుడిదోమ నివారణకు పైమెట్రోజైన్ అనే మందును లీటరు నీటికి 0.6 గ్రాముల చొప్పున కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు నీటిని వరి దుబ్బు పైనుంచి మొదళ్ల వరకు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. లేదంటే థియోమిథాక్సమ్ మందునైనా పిచికారీ చేసుకోవచ్చున్నారు. కత్తెర పురుగు, సుడిదోమ సాయంత్రం పూట దుబ్బుల నుంచి బయటకు వస్తాయని, ఈ సమయంలో మందులను పిచికారీ చేస్తే నియంత్రణ సాధ్యమవుతుందని మండల వ్యవసాయ అధికారి రూప వివరించారు.

కమిటీలతో కాలయాపన

... 5వ పేజీ తరువాయి

బాధ్యులపై చర్యలు తీసుకోలేని స్థితిలో ఉన్నారు.

మాజీ వీసీపై విచారణ లేనట్టేనా..?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలుత ఏయూ పై దృష్టి సారిస్తారని అంతా భావించారు. అయితే ఆరు నెలలు అవుతున్నా వర్సిటీ అధికారులు, ప్రభుత్వ పెద్దలు ఏయూపై దృష్టి పెట్టలేదు. దీనిపై వర్సిటీలోని పలువురు ఉద్యోగులే రగిలిపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వర్సిటీలో అడ్డగోలు వ్యవహారాలు సాగాయని, దీనిపై అప్పట్లోనే నారా లోకేశ్, పవన్ కల్యాణ్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు కూడా చేశారని గుర్తుచేస్తున్నారు. ఇప్పటివరకు గత వీసీతో సహా మరికొంతమంది అధికారుల ఆగడాలపై చర్యల్లేవని ఇదే ఇప్పుడు ఎంతో మంది ఆగ్రహానికి కారణమవుతోంది. గత ప్రభుత్వంపై పోరాటం చేసిన ఎంతో మంది ప్రస్తుతం ప్రభుత్వ మెతక వైఖరిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

కశింకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కన్నూరుపాలేనికి చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలివి. మాకవరపాలెం మండలం సుబ్రహ్మణ్యపాలేనికి చెందిన రమ్య (25)కు కశింకోట మండలం కన్నూరుపాలెం గ్రామానికి చెందిన కూండ్రపు వరప్రసాద్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. అయితే ఆదివారం ఉదయం పదకొండు గంటల సమయంలో ఇంట్లో ఉన్న ఫ్యాన్ హుక్కుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. కాగా మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. రమ్య తల్లి చిన్నతల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

పంట కాలువలో పడి యువకుడి మృతి

అనకాపల్లిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డీసీఎంఎస్ కార్యాలయ సమీపం మీ-సేవ కేంద్రం ఎదుట పంట కాలువలో ప్రమాదవశాత్తు ఓ యువకుడు పడి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ ఎస్‌ఐ శేఖరం తెలిపిన వివరాలివి. పరవాడ మండలం కలపాక గ్రామానికి చెందిన యర్రా శ్రీనివాసరావు (33) పని నిమిత్తం ఆదివారం అనకాపల్లి వచ్చి తిరిగి వెళుతున్నాడన్నారు. ఆ సమయంలో మీ-సేవ కేంద్రానికి ఎదురుగా ఉన్న యల్లయ్య కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయాడన్నారు. తలకు బలమైన గాయాలు కావడంతో ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా, ప్రాథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం అందిందని వివరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇంటి మధ్య గోడ విషయమై ఇరువర్గాల ఘర్షణ

- కత్తితో దాడి
- ఒకరికి తీవ్ర గాయాలు


ఆస్పత్రిలో క్షతగాత్రుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ ఈశ్వరరావు

కొత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజోతి) : ఇంటి మధ్య గోడ విషయమై ఇరువర్గాల నడుమ మాటామాటా పెరిగి కత్తితో దాడి చేసే పరిస్థితికి దారి తీసింది. ఈ ఘటనకు సంబంధించి పట్టణ ఎస్‌ఐ దాసరి ఈశ్వరరావు తెలిపిన వివరాలివి. అనకాపల్లి గవరపాలెం సంతోషిమాత ఆలయ సమీపంలో ఉన్న యల్లపు రమేష్ నాయుడు ఇంటికి, అదే ఇంటి వెనుక ఉన్న బొడ్డేడ రాజా ఇంటికి మధ్య మండడి గోడ విషయమై వివాదం ఉంది. ఆదివారం రాత్రి ఇదే విషయమై ఇద్దరూ మళ్లీ గొడవలు పడ్డారు. దీంతో బొడ్డేడ రాజా రమేష్‌నాయుడుపై కత్తితో వీపు వెనుక వైపు దాడి చేశాడు. ఈ దాడిలో రమేష్‌నాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సహాయంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ దాడిలో రాజాకు సహకరించిన బొడ్డేడ పూర్ణచంద్రరావు, బొడ్డేడ సంతోష్‌లపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

21న పడమటమ్మ పుట్టుక మహోత్సవం

కశింకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో ఈ నెల 21న పడమటమ్మ పుట్టుక మహోత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించి పోస్టర్‌లను మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తదితరులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ నేతలు సిదిరెడ్డి శ్రీను, కాండ్రేగుల సతీష్‌కుమార్, దాసరి బాబు, వేగి కోటేశ్వరరావు, తగరంపూడి గణపతి, జి.మోహన్, గొంతిన అప్పాజీ, వేగి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యవంతమైన జీవనం

కశింకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణతోనే మానవాళికి ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని రామచంద్ర మిషన్ ఆశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యనారాయణ అన్నారు. సంపతిపురం పంచాయతీ శివారున ఉన్న ఆశ్రమంలో పర్యావరణ పరిరక్షణపై ఆదివారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. అంతా పచ్చదనాన్ని పెంచడంతో పాటు యోగా, ధ్యానం వంటి వాటిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సెంటర్ కో-ఆర్డినేటర్లు మురళీమోహన్, జి.మంగయ్య, సప్తముఖులు మాధవి, ఐ.ఎస్.రాజు పాల్గొన్నారు.

నారా రామ్మూర్తినాయుడుకు పలువురు నివాళి

అనకాపల్లిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీనారాయణ నగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో దివంగత ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు అయిన రామ్మూర్తినాయుడు అకాల మృతి విచారకరమన్నారు. నాయకులు కర్రి దివాకర్, బొడ్డపాటి చినరాజారావు, కోటిపల్లి జేజిబాబు, రేఖా రమణమూర్తి, కోటిపల్లి శ్రీను, రేబాక ఇంద్రకుమార్, వేగి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ సభ్యత్వంతో కర్యకర్తలకు భరోసా'

లంకెలపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వం కర్యకర్తలకు ఓ భరోసా వంటిదని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఇక్కడ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం నాయుడు, రాజు, మాడిశ వెంకటరావు, దాసరి గణేశ్, అప్పారావు, బాబూరావు, కరణం అప్పారావు, ఉగ్గిన అప్పారావు, గంగిరెడ్డి శ్రీను, సూర్యనారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు

పరవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ కేవీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



అనకాపల్లిలోని భోగలింగేశ్వర, సంతోషిమాత ఆలయాల ఉత్సవ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద తదితరులు

ఆలయాల ఉత్సవ కమిటీలు ప్రమాణం



అనకాపల్లిలోని సుంకరమెట్ట సత్యనారాయణస్వామి, హేమగిరి సత్యనారాయణస్వామి దేవస్థానాల ఉత్సవ కమిటీల ప్రమాణస్వీకార దృశ్యం

అనకాపల్లి టౌన్/కొత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల ఉత్సవ కమిటీల ప్రమాణస్వీకారం ఆదివారం ఇక్కడ ఘనంగా జరిగింది. అనకాపల్లిలోని కోటమీద ఉన్న భోగలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా కాండ్రేగు సత్యనారాయణ, సభ్యులుగా మళ్ళ సూరిబాబు, బి.నాగేశ్వరరావు, పెంటకోట గణేశ్‌కుమార్ మద్దాల నారాయణరావు, దూలం సత్యవతి, రాపేటి నాగసంతోష్‌లు టీడీపీ, జనసేన నాయకుల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. అలాగే సుంకరమెట్ట సత్యనారాయణస్వామి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా బొడ్డేడ మురళీ, సభ్యులుగా సూరిశెట్టి చిన బలరామస్వామి, పెంటకోట చంద్రరావు, దొడ్డి సాయిభరత్‌లు ప్రమాణం చేశారు. సంతోషిమాత ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా మారిశెట్టి భాస్కరరావు, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావులతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీలో ఉన్న హేమగిరి సత్యనారాయణస్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ ఆదివారం ప్రమాణం చేసింది. అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ చైర్మన్‌గా ఎన్నికైన అప్పికొండ గణేశ్, సభ్యులుగా ఎన్నికైన పప్పల రామకృష్ణ, కప్పిరి తాతారావు, చొప్పా పూర్ణ, పొలమరశెట్టి నూకరాజు, సత్యవేణి, ముత్యాల అప్పారావులతో ప్రమాణం చేయించారు. ముందుగా వీరు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలి

- కూటమి ప్రభుత్వం మేలు చేస్తుందని ఆశగా ఎదురుచూపులు
- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయి


సమావేశంలో మాట్లాడుతున్న చినబ్బాయి

అనకాపల్లిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌సీ కమిషన్‌ను తక్షణమే నియమించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఫెడరేషన్ ఆఫీసు బ్యారర్ల సమావేశంలో మాట్లాడారు. గత పీఆర్‌సీ కాల పరిమితి పూర్తయి పదహారు నెలలు గడిచిందన్నారు. నూతన ప్రభుత్వం పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం పీఆర్‌సీ కమిషనర్‌గా మన్మోహన్‌సింగ్‌ను నియమించినా ఉద్యోగులకు ఎలాంటి ఐఆర్ ప్రకటించకుండా కాలయాపన చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు చేస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ గౌర వాధ్యక్షుడు నెల్లి సుబ్బారావు, అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు సూర్యప్రకాష్, పొలిమేర చంద్రరావు, రమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గవర సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం

- అధ్యక్షునిగా కొణతాల చంద్రశేఖర్ ఎన్నిక


సమావేశంలో భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చిస్తున్న సభ్యులు

అనకాపల్లిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గవర సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఆదివారం ఇక్కడ ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా బుద్ద భూలోక నాయుడు, అధ్యక్షునిగా కొణతాల చంద్రశేఖర్, గౌరవ కార్యదర్శిగా సూరిశెట్టి నర్సింగరావులు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కాండ్రేగుల విశ్వేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు, పిల్లా చిన్నికృష్ణ, కార్యదర్శిగా మళ్ళ జగన్మోహన్‌రావు, సహాయ కార్యదర్శులుగా పెతకంశెట్టి శ్రీనివాసరావు, ఆడారి శేఖర్, యల్లపు శ్రీనివాసరావు, కోశాధికారిగా పిల్లా త్రినాథరావులతో పాటు మరో పది మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు.

డిసెంబరు 22న వనసమారాధన

: జిల్లా గవర సంక్షేమ సంఘం వన సమారాధన డిసెంబరు 22న నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు కొణతాల చంద్రశేఖర్ తెలిపారు. ఇక్కడి సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. సుమారు ఇరవై వేల మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా రూపొందిస్తున్నామన్నారు. గౌరీపుత్రులంతా విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు బొడ్డేడ అప్పారావు, కాండ్రేగుల అప్పారావు, బుద్ద బలరాం శ్రీనివాసరావు, పిల్లా దుర్గరమణ, బొడ్డేడ రాజా తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన


భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

సబ్బవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గొల్లలపాలెంలో స్వామి వివేకానంద, మదర్ థెరీసా అనాథ ఆశ్రమ నిర్మాణానికి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమని నిర్వాహకులను అభినందించారు. జీవీఎంసీ 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, కూటమి నాయకులు భరణికాన బాబూరావు, ఇందలి రమణ, బలిరెడ్డి అప్పారావు, మిడతాడ మహాలక్ష్మీనాయుడు, దొడ్డి ప్రకాశ్, గవర అప్పారావు, శీరం అప్పలరాజు, బంతికోళ్ల పద్మ, కర్రి కనకరాజు, కర్రి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో భూలోకమ్మ పండుగ


భూలోకమ్మ చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

సబ్బవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మలునాయుడుపాలెం, పెదనాయుడుపాలెం గ్రామాల్లో ఆదివారం భూలోక అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు పూజా సామగ్రితో తరలి వెళ్లి, భూలోకమ్మ చెట్టు చుట్టూ ప్రదక్షణలు చేసి పూజలు నిర్వహించారు. కుటుంబాలు, బంధుమిత్రులతో అంతా కలిసి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో ఆయా గ్రామాల నాయకులు నాయకులు మిడతాన రాములు, గండి అక్కయ్య, దేవుడు, తంగేటి అప్పారావు, రొంగలి అచ్యుతరావు, సింగంపల్లి సూర్యనారాయణ, సూరెడ్డి సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నకిలీ నోట్లు మార్పిడి ముఠా



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లు

లంకెలపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఐదు వందల రూపాయల నకిలీ నోట్లు మార్పిడి చేస్తున్న నలుగురు వ్యక్తులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. కాకినాడ జిల్లా ముమ్మిడివరం ప్రాంతానికి చెందిన గుత్తుల విశాల్, అతని మామయ్య శీలం శ్రీను కొబ్బరి కాయల వ్యాపారం చేస్తుంటారు. ఎప్పటిలాగే శుక్రవారం వ్యాన్‌లో కొబ్బరికాయలను తీసుకొచ్చి విశాఖపట్టణంలోని ఎన్ఏడీ ప్రాంతంలో విక్రయించారు. తిరుగు ప్రయాణంలో లంకెలపాలెం జంక్షన్‌లో ఆగి ఇరువురూ టీ తాగుతున్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వచ్చి విశాల్‌కు నాలుగు నకిలీ ఐదు వందల నోట్లు ఇచ్చి చిల్లర కావాలని అడిగాడు. దీంతో అతడు వంద నోట్లు ఇచ్చాడు. కాసేపటి తర్వాత నోట్లుపై చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ఉండడాన్ని గుర్తించి వెంటనే పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నకిలీ నోట్లు మార్పిడి చేస్తున్న నలుగురు వ్యక్తులను మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఎస్ఐ కృష్ణారావు సిబ్బందితో వెళ్లి సదరు ముఠాను శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు నకిలీ ఐదు వందల నోట్లు, 20 అసలు వంద నోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ పరవాడ సీఐ మల్లికార్జునరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరవాడ డ్వాక్రా మహిళల ఔదార్యం

- గుండె జబ్బుతో బాధపడుతున్న యువకుడికి రూ. 1.04 లక్షల ఆర్థిక సాయం


చిన్నా కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

పరవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడకు చెందిన డ్వాక్రా మహిళలు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇక్కడి బొంకులదిబ్బ వీధికి చెందిన నెక్కల చిన్నా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి వైద్య సహాయం నిమిత్తం 619 మంది డ్వాక్రా మహిళలు తలావంతు చేసుకుని రూ.1.04 లక్షలను సమకూర్చారు. ఈ మొత్తం నగదును సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు చేతుల మీదగా చిన్నా తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బి.రంగారావు, సీసీ డి.విజయకుమారి, వీవోఏలు పోతల రమాదేవి, బి.రమణమ్మ, స్థానిక నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరరావు తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE SPECIAL SESSION JUDGE FOR TRIAL OF SC & ST CASES UNDER (POA) ACT CUM XI ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
E.P.2/2016 IN O.S. 12/2010

Between
శ్రీ సింగుపల్లి రామారావు ...వాది
And
శ్రీ యర్రా వెంకటరమణ ..ప్రతివాది

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటీషన్ అసలు మొత్తం సొమ్ము ఇందలి జె.డి.ఆర్. నుండి రాబట్టుటకు జె.డి.ఆర్.కు సంపూర్ణ హక్కు అనుభవములో యున్న క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీ కోర్టు వారు తేది.04-12-2024న ఉదయం గం॥10-30 ని॥లకు వేలం వేయుటకు నిర్ణయించినారు. కావున సదరు వేలంలో పాల్గొనదలచిన వారు పైన వివరించిన తేదీ, సమయములలో పై శ్రీ కోర్టువారు ఎదుట హాజరు అయి సదరు కోర్టు వారు చేసిన నిబంధనలు ప్రకారం వేలంలో పాల్గొనగలరు.

వేలం ఆస్తి షెడ్యూలు

క్రింద వివరించబడిన ఐటమ్ షెడ్యూలు ఆస్తులు అన్నియూ విశాఖపట్నం జిల్లా, సబ్బవరం సబ్ రిజిస్ట్రారు యిలాకా, సబ్బవరం మండలం, అసకపల్లి గ్రామ పరిధిలో ఉన్నవి.

ఐటమ్-1: భూమి విస్తీర్ణం య.1.31 సెంట్లు, సర్వే నెం.153/2 లో య.1.02 సెంట్లు, సర్వే నెం. 153/3 లో య.0.24 సెంట్లు, సర్వే నెం.153/4 య.0.05 సెంట్లుకు హద్దులు : **తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** రోడ్డు, **ఉత్తరం:** మెటల్ రోడ్డు, **పడమర:** నీటి కాలువ
డి.హెచ్.ఆర్. విలువ: రూ.6,55,000/-, అమీన్ విలువ: రూ.90,00,000/-

ఐటమ్-2: సర్వే నెం.153/6 లో య.0.19 సెంట్లు విస్తీర్ణం గల భూమికి హద్దులు : **తూర్పు:** కన్నం రామునాయుడు గారి భూమి, **దక్షిణం:** చింతల సింహాచలం గారి భూమి, **ఉత్తరం:** మెటల్ రోడ్డు, **పడమర:** ట్యాంకు.
డి.హెచ్.ఆర్. విలువ: రూ.95,000/-, అమీన్ విలువ: రూ.8,00,000/-

ఐటమ్-3: సర్వే నెం.153/9 లో య.0.15 సెంట్లు విస్తీర్ణం గల భూమికి హద్దులు : **తూర్పు:** చిట్టిబోయిన దేముడు గారి భూమి, **దక్షిణం:** సుంకర అప్పలనాయుడు గారి భూమి, **ఉత్తరం:** చిట్టిబోయిన దేముడు గారి భూమి, **పడమర:** కన్నం రామునాయుడు గారి భూమి.
డి.హెచ్.ఆర్. విలువ: రూ.75,000/-, అమీన్ విలువ: రూ.75,000/-

ఐటమ్-4: సర్వే నెం.151/8 లో య.0.24 సెంట్లు విస్తీర్ణం గల భూమికి హద్దులు : **తూర్పు:** సుంకర సూర్యనారాయణ గారి భూమి, **దక్షిణం:** సుంకర సూర్యనారాయణ గారి భూమి, **ఉత్తరం:** సుంకర సూర్యనారాయణ గారి భూమి, **పడమర:** సుంకర అప్పలనాయుడు గారి భూమి.
డి.హెచ్.ఆర్. విలువ: రూ.1,20,000/-, అమీన్ విలువ: రూ.1,00,000/-

ఐటమ్-5: భూమి విస్తీర్ణం య.0.37 సెంట్లు, సర్వే నెం.151/10 లో య.0.08 సెంట్లు, సర్వే నెం.151/13 లో య.0.07 సెంట్లు, సర్వే నెం.151/21 లో య.0.22 సెంట్లు విస్తీర్ణం గల భూమికి హద్దులు : **తూర్పు:** తలారు యల్లారావు మొదలగు వారి భూమి మరియు గెడ్డ, **దక్షిణం:** తలారి సోములమ్మ గారి భూమి, **ఉత్తరం:** సుంకర అప్పలనాయుడు గారి భూమి, **పడమర:** సుంకర రాములమ్మ గారి భూమి.
డి.హెచ్.ఆర్. విలువ: రూ.1,85,000/-, అమీన్ విలువ: రూ.1,20,000/-

ఐటమ్-6: సర్వే నెం.151/18 లో య.0.16 సెంట్లు విస్తీర్ణం గల భూమికి హద్దులు : **తూర్పు:** గెడ్డ, **దక్షిణం:** సుంకర రాములమ్మ గారి భూమి, **ఉత్తరం:** ముమ్మన రామునాయుడు గారి భూమి, **పడమర:** సుంకర రాములమ్మ గారి భూమి.
డి.హెచ్.ఆర్. విలువ: రూ.80,000/-, అమీన్ విలువ: రూ.1,50,000/-

ఐటమ్-7: సర్వే నెం.152/13 లో య.0.15 సెంట్లు విస్తీర్ణం గల భూమికి హద్దులు : **తూర్పు:** నక్క సూరి మరియు సుంకర రాములమ్మ గారి భూమి, **దక్షిణం:** తలారి రామునాయుడు గారి భూమి, **ఉత్తరం:** తలారి యల్లారావు గారి భూమి, **పడమర:** సుంకర గంగునాయుడు గారి భూమి.
డి.హెచ్.ఆర్. విలువ: రూ.75,000/-, అమీన్ విలువ: రూ.1,60,000/-

ఐటమ్-8: సర్వే నెం.129/4 లో య.0.75 సెంట్లు విస్తీర్ణం గల భూమికి హద్దులు : **తూర్పు:** కన్నం ముసలయ్య గారి భూమి, **దక్షిణం:** కన్నం ముసలయ్య గారి భూమి, **ఉత్తరం:** గ్రామ కంఠం, **పడమర:** బొశెట్టి వెంకటరమణ మరియు తంగేటి మాణిక్యం మొదలగు గారి భూమి.
డి.హెచ్.ఆర్. విలువ: రూ.3,75,000/-, అమీన్ విలువ: రూ.15,00,000/-

ఐటమ్-9: సర్వే నెం.129/6 లో య.0.07 సెంట్లు విస్తీర్ణం గల భూమికి హద్దులు : **తూర్పు:** తంగేటి మాణిక్యం గారి భూమి, **దక్షిణం:** కన్నం ముసలయ్య గారి భూమి, **ఉత్తరం:** కన్నం ముసలయ్య గారి భూమి, **పడమర:** కన్నం ముసలయ్య గారి భూమి.
డి.హెచ్.ఆర్. విలువ: రూ.35,000/-, అమీన్ విలువ: రూ.1,40,000/-

ఐటమ్-10: సర్వే నెం.129/7 లో య.0.08 సెంట్లు విస్తీర్ణం గల భూమికి హద్దులు : **తూర్పు:** సుంకర సూర్యనారాయణ గారి భూమి, **దక్షిణం:** సుంకర అప్పలనాయుడు గారి భూమి, **ఉత్తరం:** కన్నం ముసలయ్య గారి భూమి, **పడమర:** చిట్టిబోయిన దేముడు గారి భూమి.
డి.హెచ్.ఆర్. విలువ: రూ.40,000/-, అమీన్ విలువ: రూ.1,60,000/-

ఐటమ్-11: సర్వే నెం.129/8 లో య.0.13 సెంట్లు విస్తీర్ణం గల భూమికి హద్దులు : **తూర్పు:** తంగేటి ముత్యాలు గారి భూమి, **దక్షిణం:** సుంకర సూర్యనారాయణ గారి భూమి, **ఉత్తరం:** కన్నం ముసలయ్య గారి భూమి, **పడమర:** సుంకర అప్పలనాయుడు గారి భూమి.
డి.హెచ్.ఆర్. విలువ: రూ.65,000/-, అమీన్ విలువ: రూ.2,60,000/-

డి.హెచ్.ఆర్. విలువ	: రూ. 18,00,000/-
కోర్టు అమీన్ విలువ	: రూ. 1,24,60,000/-
సబ్ రిజిస్ట్రారు విలువ	: రూ. 41,20,000/-
E.P. సొమ్ము	: రూ. 16,88,238/-
ఫర్దర్ హియరింగ్	: తేది. 18-12-2024

పై వేలం ఆస్తి వివరం తెలుసుకొనగోరు వారు ఈ క్రింది అడ్రస్‌లో లాయర్ గారిని సంప్రదించగలరు.

నాగిరెడ్డి చిట్టిబాబు, అడ్వకేట్
డోర్ నెం.40-2-81, శాంతినగర్, కైలాసపురం రోడ్డు,
విశాఖపట్నం-530024. సెల్ : 9441019339